


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 19-07-2020 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 270 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పరిశ్రమలలో తగు భద్రతా ప్రమాణాలను పాటించాలి

### రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు





విశాఖపట్నం : పరిశ్రమలలో తగు భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక వుడా చిల్డ్రన్ ఎరీనా లో పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలు వాటి నివారణ చర్యలపై పారిశ్రామికవేత్తలు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రశాంత నగరంగా గుర్తింపు పొందిన విశాఖలో ఇటీవల కాలంలో పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు సంభవించటం విచారించదగిన విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అదే విధంగా పారిశ్రామిక అభివృద్ధికి కూడా అంతే ప్రాధాన్యతను కల్పిస్తున్నదని, పరిశ్రమల వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. విశాఖలో సహజ వనరులతో పాటు రెండు పోర్టులు, నావెల్ ఉండగా త్వరలో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టు, మెట్రో రైలు ప్రాజెక్ట్ రానున్నాయని వీటి వలన నగరం, జిల్లా, రాష్ట్రం అభివృద్ది పథంలో దూసుకు పోతుందన్నారు. పరిశ్రమలకు భద్రతాపరంగా శాశ్వత ప్రాతిపదికన అనుమతులు ఉన్నప్పుడే ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవస్థ సాఫీగా జరుగుతుందని , దీనివలన యాజమాన్యంతో పాటు సిబ్బంది, ప్రజలు సురక్షితంగా ఉంటారన్నారు.

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలను పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించకుండా నియంత్రించగలమన్నారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలతో ఈ

తరువాయి 2లో..

## తిరుమలలో 50 మంది అర్చకుల్లో 15 మందికి కరోనా

### టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కైంకర్యాల పర్యవేక్షకులకు అనారోగ్యంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. అనారోగ్యానికి గురైన అర్చకులను మెరుగైన వైద్యంకోసం చెన్నైలోని అపోలో దవాఖానకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కైంకర్యాల పర్యవేక్షకుల ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఆలయంలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా శ్రీవారి దర్శనాల కొనసాగింపు అంశంపై మరోమారు సమీక్ష జరుపుతామని చెప్పారు. స్వామివారికి కైంకర్యాలు నిర్వహించే 50 మంది అర్చకుల్లో 15 మందికి కరోనా వైరస్ సోకింది. మరో ఇద్దరికి కరోనా లక్షణాలు

తరువాయి 2లో..

## గవర్నర్ ఆమోదానికి 'మూడు రాజధానుల బిల్లులు'

అమరావతి: 'సీఆర్డీఏ రద్దు, అభివృద్ధి వికేంద్రీకరణ బిల్లు'లను గవర్నర్ ఆమోదానికి ఏపీ ప్రభుత్వం శనివారం పంపించింది. శాసనమండలిలో రెండోసారి పెట్టి నెల రోజులు గడిచినందున నిబంధనల ప్రకారం అసెంబ్లీ అధికారులు.. గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు పంపించారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 197 క్లాజ్ 2 ప్రకారం రెండోసారి బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

మండలిలో పెట్టిన నెల రోజుల తర్వాత ఆటోమెటిక్‌గా ఆమోదించినట్టుగా పరిగణిస్తూ గవర్నర్ ఆమోదం కోసం రెండు బిల్లులను అసెంబ్లీ అధికారులు పంపించారు.

## టీడీపీ నేతలు విచిత్రంగా వ్యవహరిస్తున్నారు

### వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు



అమరావతి: బిల్లులను అడ్డుకోవడం ద్వారా టీడీపీ స్వలాభం చూసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో ప్రతిపక్షాలు చెబుతున్నాయని ఆయన నిప్పులు చెరిగారు. "ప్రజల అభివృద్ధి సంక్షేమం పట్టించుకోనందు వల్లే టీడీపీని పక్కన పెట్టారు. రాజ్యాంగం నిబంధనల పట్ల టీడీపీ నేతలు విచిత్రంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు గ్యాలరీలో కూర్చుని మండలిని శాసించాలని ప్రయత్నించారు. మండలి ఛైర్మన్ నిబంధనలు పట్టించుకోకుండా విచక్షణాధికారం అన్నారు. రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనలో నిపుణుడైన యనమల రామకృష్ణుడు.. గవర్నర్‌కు లేఖ రాయడం దౌర్భాగ్యం' అంటూ మంత్రి ధ్వజమెత్తారు. కొంతమంది ప్రయోజనాల కోసం టీడీపీ ప్రయత్నిస్తోందని, వికేంద్రీకరణ ఎందుకు కుదరదో టీడీపీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి టీడీపీకి అవసరం లేదా? అని ప్రశ్నించారు.

టీడీపీ ప్రయోజనాలన్నీ అమరావతితో ముడిపడి ఉన్నాయని, అందుకే ఇతర ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ప్రజాభిప్రాయాన్ని టీడీపీ నేతలు తెలుసుకోవాలని కన్నబాబు హితవు పలికారు. శ్రీకృష్ణ కమిటీ స్పష్టంగా పరిపాల వికేంద్రీకరణ అవసరమని చెప్పిందని, చంద్రబాబు చెప్పినట్లు చేస్తేనే సక్రమంగా జరిగినట్లు భావించడం సరికాదన్నారు.

"చంద్రబాబుకు అమరావతిపై ఉన్నది కపట ప్రేమ. ఐదేళ్లలో అమరాతి అభివృద్ధిని పట్టించుకోలేదు. అన్ని ప్రాంతాల అభివృద్ధి చేయడమే సీఎం జగన్ లక్ష్యం. ప్రాజెక్టుల పూర్తికి సహకరించకుండా టీడీపీ సమస్యలు సృష్టిస్తోంది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చంద్రబాబు మోసం చేశారని' కన్నబాబు దుయ్యబట్టారు.

భారీ వర్షాలకు నష్టపోయిన పంటలపై సీఎం జగన్ సమీక్షించి ఆదుకోవాలని ఆదేశించారని మంత్రి తెలిపారు. రైతులందరికి భరోసా ఇచ్చే ప్రభుత్వం..

తరువాయి 2లో..

## అమరనాథ్ గుహను సందర్శించిన రాజ్‌నాథ్



శ్రీనగర్: రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం పవిత్ర అమరనాథ్ గుహను సందర్శించారు. దాదాపు గంటపాటు అక్కడే గడిపారు. మహిమాన్వితుడైన అమర లింగేశ్వరుడికి పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు ఆశీస్సులు అందించారు. జమ్ముకశ్మీర్ పర్యటనలో భాగంగా రెండో రోజు ఆయన అమరనాథ్ గుహకు రావడం గమనార్హం. తొలిరోజు ఆయన లద్దాఖ్‌లో పర్యటించారు. సైనికులతో సరిహద్దుల్లో పరిస్థితిని సమీక్షించారు. జమ్ము కశ్మీర్‌లోని అమరనాథ్ గుహను సందర్శించడం, దేవుడిని ప్రార్థించడం ఆశీర్వాదంగా అనిపించిందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. శుక్రవారం రోజు రాజ్‌నాథ్ సింగ్ సైన్యంలోని అగ్రశ్రేణి అధికారులతో సమావేశం అయ్యారు. సరిహద్దుల్లోని పరిస్థితిని సమీక్షించారు. పాకిస్థాన్ ఎలాంటి కుతంత్రాలకు పాల్పడినా గట్టిగా బదులివ్వాలని సైనికులకు సూచించారు. నియంత్రణ రేఖ వద్ద పటిష్ఠ నిఘా ఉంచాలని ఆదేశించారు. భారత్‌కు చెందిన అంగుళం భూభాగాన్నీ ప్రపంచంలో ఏ శక్తీ తాకలేదని స్పష్టం చేశారు. చైనాతో చర్చలు ఏ మేరకు ఫలప్రదం అవుతాయో హామీ ఇవ్వలేనన్నారు. దేశ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే దీటుగా సమాధానం చెబుతామన్నారు. గల్వాన్‌లో భారత జవాన్ల ధైర్య సాహసాలను దేశం ఎన్నటికీ మర్చిపోదని ఉద్ఘాటించారు.

## ఏపీలో కొత్తగా 3,963 కరోనా కేసులు

అమరావతి: ఏపీలో కరోనా విజృంభణ కొనసాగుతోంది. రోజు రోజుకూ కేసుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా 3,963 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఒకే రోజు ఇంత ఎక్కువ మొత్తంలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 44,609కి చేరింది. గడిచిన 24 గంటల్లో కరోనా బారిన పడి 52 మంది మృతి చెందగా.. ఇప్పటి వరకు 589 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం బులిటెన్ విడుదల చేసింది. తూర్పు గోదావరిలో 12 మంది, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 8, అనంతపురంలో 7, పశ్చిమగోదావరిలో 5, ప్రకాశంలో 4, నెల్లూరులో 3, విశాఖలో 2, చిత్తూరు, కడప, విజయనగరం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వివిధ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో 22,260 మంది చికిత్స పొందుతుండగా.. 21,763 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జి అయినట్లు ప్రభుత్వం బులిటెన్‌లో పేర్కొంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 12.84 లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పింది.




## కలిసి జీవిద్దాం.. ఒకరికొకరు సహకరించుకుందాం

### భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ : భారత ప్రాచీన జీవన పద్ధతైన 'కలిసి జీవిద్దాం.. ఒకరికొకరు సహకరించుకుందాం' విధానాన్ని కొనసాగిస్తూ తర్వాతి తరాలకూ కూడా ఇంతటి గొప్ప సంస్కృతిని, విలువలను అందజేయాల్సిన అవసరముందని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. దేశంతో పాటు యావత్ ప్రపంచ శ్రేయస్సుకోసం భారత ప్రాచీన విధానమైన తోటివారితో కలిసి పంచుకోవడం, అందరి పట్ల శ్రద్ధ చూపడం కూడా అలవర్చుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. మైసూరు 25వ మహారాజు శ్రీ జయ చామరాజ వడయార్ శత జయంత్యుత్సవాల ముంగింపు సందర్భంగా వెంకయ్యనాయుడు ఆన్‌లైన్ వేదికగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ...

భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మహారాజ శ్రీ జయ చామరాజ వడయార్ వంటి పాలకుల దేశభక్తి, దీర్ఘదృష్టితో సమసమాజ స్థాపన లక్ష్యంతో వారు చేసిన ప్రజారంజక పాలన ప్రశంసనీయమన్నారు. ఓ సమర్థవంతమైన పాలకుడిగా స్వాతంత్ర్యానికి పూర్వ భారతదేశంలో ఓ బలమైన, ఆత్మనిర్భరత, సుస్థిరాభివృద్ధి కలిగిన మైసూరు రాజ్య నిర్మాణంలో మహారాజ శ్రీ జయ చామరాజ వడయార్ పాత్ర అత్యంత కీలకం అని పేర్కొన్నారు. మైసూరులో ఓ బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఉండాలని నిర్ణయించి రాజ్యాంగసభను ఏర్పాటుచేయడం, దీనికి కేసీ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. చాలా అంశాల్లో చాణక్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న ఆదర్శాలను మహారాజా వారు ఆచరించారన్నారు. మహారాజ వారు ప్రాచీన విలువలు, ఆధునిక ఆలోచనల కలబోత అన్నారు. ఆధునిక భారతంలో బెంగళూరులో హిందుస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్ లిమిటెడ్ (తర్వాతి కాలంలో హెచ్ఏఎల్‌గా మారింది), జాతీయ

తరువాయి 2లో..

# రాజధాని కేంద్రం పరిధిలోని అంశం: యనమల



విజయవాడ: రాజధాని ఏర్పాటు అనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని మాజీ మంత్రి, తెదేపా సీనియర్‌నేత యనమల రామకృష్ణుడు అన్నారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "పునర్విభజన చట్టంలో.. కేంద్రం ఏర్పాటు చేసే కమిటీ సిఫార్సుల మేర రాజధాని ఏర్పాటు కావాలని ఉంది. అందుకు అనుగుణంగానే శివరామకృష్ణ కమిటీ నివేదిక ప్రకారం నాటి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంచుకుంది. విభజన చట్టంలో రాజధాని అని మాత్రమే ఉంది, రాజధానులు అని లేదు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా 3 రాజధానులు చేయాలంటే విభజన చట్టంలో సవరణ అవసరం. ఈ అంశాలన్నీ గవర్నర్ పరిగణనలోకి తీసుకుని వ్యవహరించాలి. వివాదాస్పద బిల్లులపై భిన్నాభిప్రాయాలు ఉన్నందుకే కేంద్రం సలహా తీసుకోవాలని కోరాం. ప్రభుత్వం ఓసారి చట్టం అయిందని భావించాక ఇక అది రాష్ట్రపతికి పంపాలా లేక న్యాయ సలహా కోరాలా అనేది గవర్నర్ ఇష్టం" అని యనమల వివరించారు.

**ఆ రెండు బిల్లులు పెండింగ్‌లోనే...**

"పరిపాలన వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రజలకు సంబంధించిన బిల్లులకు మండలి ఆమోదం లేదా తిరస్కరణ అవసరం. తిరస్కరిస్తే డీమడ్ టు బీ పాస్డ్ చేయవచ్చు. రెండు బిల్లులకు మండలి ఆమోదం లేదా తిరస్కరణ లభించలేదు. ప్రజాభిప్రాయం కోసం సెలెక్ట్ కమిటీ పెండింగ్‌లో ఉన్నాయి. గవర్నర్ కూడా దీనిపై ప్రజాభిప్రాయం, న్యాయ సలహా తీసుకోవాలి. ప్రజాభిప్రాయం తీసుకోవడానికి ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోంది. సెలెక్ట్ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులను మళ్లీ సభ ముందుకు తీసుకురావడం తగదు. ప్రభుత్వం తన అభిప్రాయాలను ప్రజలపై రుద్దాల్సిన అవసరం ఏముంది?" అని యనమల ప్రశ్నించారు.

# బీచ్ ప్రహరీ నిర్మాణం కోసం మత్స్యకారుల వినతి

భీమునిపట్నం : భీమిలి సముద్ర తీర ప్రాంతం లో సుమారు 1984 లో నిర్మించిన సముద్ర ప్రహరీ హుదూద్ తుఫాన్ వల్ల పూర్తిగా సముద్రం కోత కు గురి అయ్యి ప్రహరీ మొత్తం ధ్వంసం అయిందని, దీని వలన ఇప్పుడు తీరప్రాంత మత్స్యకార ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మీడియా కు వివరించారు. 2014 హుదూద్ తుఫాన్ కు తీరప్రాంతం కోతకు గురి ఐన తరువాత స్థానిక నాయకులు అప్పటి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ ను అనేక సార్లు కలసి ప్రహరీ నిర్మాణం చేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరితే, అయన ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గా మిగిపోయాయని ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని జానకిరామ్ మీడియా కు తెలిపారు. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభం, తుపానుల కాలం అవటం వల్ల తీరప్రాంత గ్రామాలైన ఎగువపేట, బొయివీధి ప్రాంత ప్రజలు భయం తో కాలం గడుపుతున్నారని, గత ప్రభుత్వం కంటితుడుపు చర్యలు మాత్రమే చేసిందని, కానీ సమస్య ను పూర్తిగా పరిష్కారం చేయలేదని తెలిపారు. పైగా ఈ సముద్ర తీరం గుండా రోడ్డు ఉండటంతో, రోడ్డు కూడా కోతకు గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే మరియు జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్ ఈ సమస్య పై స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి పూనుకోవాలని, కాబట్టి ఈ సమస్య పై అధికారులు, మంత్రి స్పందించి ప్రజలకు మంచి జరిగే విధంగా కృషి చేయాలనీ వాసుపల్లి జానకిరామ్ మీడియా ద్వారా కోరారు.

# టీడీపీ ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ



భీమునిపట్నం: భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటానూకరాజు ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ చేసారు. భీమిలి లో ఉన్న కూరగాయలు అమ్మే.వారికి,కూలీలకు నూకరాజు తన స్వంత ఖర్చులతో మాస్కులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో మాస్కులు ప్రతీఒక్కరికీ అవసరమే అని అన్నారు. ఇంటి నుండి బయటకు వచ్చేటప్పుడు మాస్కులు తప్పనిసరి గా ధరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చురకల రమణ, పూతి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి సెంటీనియల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ




భీమునిపట్నం : భీమిలి సెంటీనియల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాస్కులు పంపిణీ చేసారు. భీమిలి మార్కెట్, గంటస్థంభం,చిన్న బజార్ తదితర ప్రాంతాలలో ఉన్న ప్రజలకు 3వేలు మాస్కులు పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉందని, కరోనా కష్ట కాలంలో లయన్స్ క్లబ్ పాత్ర ఎంతో కీలకపాత్ర పోషించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్తరవు వాయునందనరావు, కార్యదర్శి లయన్ లచ్చు బుగత . గణపతిరావు, కోశాధికారి టి.వి.ఎస్ నాయుడు, ఇన్సులేషన్ ఆఫీసర్ లయన్ బి. బాలసుబ్రహ్మణ్యం,లయన్ కె.ఎస్ మూర్తి, లయన్ ప్రతాప్, లయన్ డా.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు



శ్రీకాకుళం : ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. కరోనా వ్యాధి నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శనివారం ఒక సందేశాన్ని ఇచ్చారు. రెండు నెలల క్రితం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కరోనా కేసులు జీరోగా ఉండేవని, లాక్ డౌన్ సడలింపు తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని అన్నారు. జిల్లాలో కరోనా కేసులు పెరుగుతూ కంటైన్మెంటు జోన్లు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజలు కొంత తెలిసి, కొంత తెలియక చేస్తున్న తప్పుల వలన వైరస్ వ్యాప్తి జరుగుతోందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఇచ్చిన సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మీటర్ల దూరాన్ని పాటించాలని, ముక్కు, నోరు కవర్ చేస్తూ మాస్కు ధరించాలని, విధిగా చేతులు సబ్బుతో గాని, శానిటైజర్ తో గాని శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉమ్మి వేయరాదని ఆయన స్పష్టం చేశారు. నోరు, ముక్కు, కళ్ల ద్వారా వైరస్ వ్యాప్తి చెందడానికి అవకాశం ఉంటుందని కావున ముఖాన్ని తాకరాదని ఆయన చెప్పారు. అపార్టుమెంట్లు, ఇరుగు,పొరుగు వారు ఒకరి నుండి ఇంకొకరి ఇళ్ళకు వెళ్ళే అలవాటు ఉంటుందని, అటువంటి అలవాట్లను ప్రస్తుతం మానుకోవాలని ఆయన సూచించారు. దగ్గరగా కూర్చుని మాట్లాడటం వలన వైరస్ వ్యాప్తి చెందడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆటో, బస్సు తదితర వాహనాల్లో ప్రయాణం చేస్తున్న వారు శానిటైజ్ చేసారా లేదా అని పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఆరోగ్యం దృష్ట్యా ఎవరి సీటు వారు శానిటైజ్ చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ఆయన పేర్కొన్నారు. ఆటోలో పరిమితికి మించి ఎవరు వెళ్లరాదని అన్నారు. కరోనా పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అదేసమయంలో అజాగ్రత్త వద్దని సూచించారు. నాకు రాదు అని అనుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు పరిమితంగానే ఉంటాయనే విషయాన్ని గ్రహించాలని ఆయన అన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు పరిమితంగా ఉంటాయని, వెంటిలేటర్లు మరింత పరిమితంగా ఉంటాయని గుర్తుంచుకోవాలని చెప్పారు. జిల్లాలో రెండు నుంచి మూడు వేల మందికి చికిత్స చేయడానికి సౌకర్యాలు అందుబాటులో ఉండే అవకాశాలు ఉంటాయని, కేసులు పెరుగుతూ 10 వేలు, 20 వేలు వచ్చినా, ఇంకా ఎక్కువగా వచ్చిన పరిస్థితుల్లో ఏమి చేసే పరిస్థితి లేదని చెప్పారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలోను, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిలోనూ కరోనా వ్యాప్తి వలన వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య శాఖ సూచిస్తుందని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే సమీప ఆసుపత్రికి వెళ్ళాలని లేదా హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేసి తెలియజేయాలని ఆయన సూచించారు. వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారని చెప్పారు. గతంలో వచ్చిన మలేరియా, ఎబోలా, సార్స్, కలరా వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించడం జరిగిందని, ప్రస్తుత కరోనా వైరస్ వ్యక్తుల మధ్య త్వరగా వ్యాప్తి జరుగుతోందని గమనించాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటిస్తూ అవసరమైతే చేతికి గ్లోవ్స్ ధరించాలని అన్నారు. కరోనా వచ్చినా వాస్తవానికి భయపడాల్సిన అవసరం లేదని, కరోనా వస్తుందనే భయంతో కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు చూస్తున్నామని, అటువంటి అవసరం లేదని అన్నారు.

**మనల్ని మనం కాపాడుకుందాం** : వ్యాక్సిన్ వచ్చేంతవరకు మనల్ని మనం, మన కుటుంబాన్ని, మన బంధువులను, స్నేహితులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మీరు బాగుండాలి - అందరూ బాగుండాలి అని పిలుపునిచ్చారు. నాతో సహా నా చుట్టూ ఉన్న అందరూ బాగుండాలని నేను కోరుకుంటున్నానని అదే తరహాలో ప్రతి ఒక్కరు కోరుకోవాలని అన్నారు. అనుమానం ఉంటే వెంటనే పరీక్షలు చేసుకుని, తక్షణం చికిత్స పొందాలని సూచించారు. వైద్యులు, పారిశుధ్య కార్మికులు మన కోసం పనిచేస్తున్నారని చెప్పారు.

**కరోనా లక్షణాలు లేని పాజిటివ్ వ్యక్తుల జాగ్రత్తలు పాటించాలి** : కరోనా లక్షణాలు లేనివారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. వారిలో పరీక్షలు జరిపిన వరకు తెలియడం లేదని చెప్పారు. ప్రతి ఒక్కరూ గొడుగులు వేసుకోవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా భౌతిక దూరం పాటించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. మాస్కులు ధరించని వారికి అపరాధ రుసుము విధించే అవకాశాలు కల్పించడం జరిగిందని చెప్పారు.

**వైద్యులు ప్రాణాలను పణంగా పెడుతున్నారు** : వైద్యులు సేవలు అందిస్తున్న సేవల పట్ల ఎటువంటి సందేహాలు ఉండాల్సిన అవసరం లేదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. వైద్యులు ప్రాణాలను పణంగా పెట్టి చికిత్స అందిస్తున్నారని అన్నారు. ఎక్కడైనా చికిత్స చేయుటకు వ్యతిరేకిస్తే అటువంటి వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

**మానవత్వానికి మచ్చ** : కరోనా మృతదేహాల దహన సంస్కారాలను నిర్వహించుటకు మానవత్వానికి మచ్చ తెస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయని అన్నారు. మానవత్వాన్ని మరిచి వ్యవహరిస్తున్న సంఘటనలు సరైన విధానం కాదని చెప్పారు. మృతదేహాల ద్వారా వ్యాప్తి జరగదని, మృతి చెందిన ఆరు గంటల తర్వాత వైరస్ ఉండదని అన్నారు. మృతి చెందిన వ్యక్తి నుండి వైరస్ వ్యాప్తి కాకుండా ఆరోగ్య శాఖ సూచనలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతారని గ్రహించాలని, తద్వారా ఎటువంటి వ్యాప్తి జరగదని అన్నారు. దహన సంస్కారాలకు ఎవరైనా అడ్డుపడితే చట్టాలను ఉల్లంఘించిన వారు కాగలరని అన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**కోర్టులు పనిచేస్తాయి** : కోర్టులు, కార్యాలయాలు, అనుమతి పొందిన దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ప్రజల్లో అనవసర అపోహ ఉందని అన్నారు. కోర్టులు విడతలవారీగా సిబ్బందితో పని చేస్తుందని తెలిపారు.

అత్యవసర కేసులను ఇ - ఫైలింగ్ ద్వారా నమోదు చేయవచ్చని, అటువంటి కేసులను విచారణ చేసి తీర్పు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కరోనా సమయంలో గృహ హింస పెరుగుతున్నట్లు సమాచారం అందుతుందని, బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయవచ్చని సూచించారు.

**న్యాయ సహాయం పొందవచ్చు పాజిటివ్ వ్యక్తులు బయట తిరిగితే కేసు నమోదు** : పారా లీగల్ వాలంటీర్లు మీ కోసం అనునిత్యం అందుబాటులో ఉంటున్నారని ఆయన అన్నారు.

కరోనా అంశంలో సమస్యలు ఉంటే జిల్లా, మండల న్యాయసేవాధికార సంస్థలను సంప్రదించి న్యాయాన్ని పొందవచ్చని అన్నారు. కరోనా పాజిటివ్ ఉన్న వ్యక్తులు బయట తిరిగితే అటువంటి వారిపై ఐపిసి, ఎపిడమిక్ చట్టాల కింద చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అటువంటి వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తారని అన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# తిరుమలలో 50 మంది అర్చకుల్లో 15 మందికి కరోనా

ఉండటంతో వారు కూడా శ్రీవారి కైంకర్యాలకు దూరమయ్యారు. దీంతో స్వామివారి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడకుండా తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులను డిప్యుటేషన్‌పై శ్రీవారి ఆలయంలో నియమించారు.

# టీడీపీ నేతలు విచిత్రంగా వ్యవహరిస్తున్నారు

జగన్ ప్రభుత్వ మన్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని, వైఎస్సార్ రైతు భరోసాతో రైతులను ఆదుకుంటున్నామని మంత్రి కన్నబాబు తెలిపారు.

ఆ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి..

మద్యం పాలసీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కన్నబాబు మండిపడ్డారు. దశలవారి మద్యపాన నిషేధానికి సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుంచి మద్యం షాపులను తప్పించారని పేర్కొన్నారు. "చంద్రబాబు పాలనలో పెట్టిన 43 వేల బెల్ట్ షాపులతో పాటు, 4500 పర్మిట్ రూమ్ లను తొలగించాం. మద్యం అక్రమాలను అరికట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో తెచ్చా"మని తెలిపారు. ఇలా చేస్తే బెల్ట్ షాపుల కోసం మహిళలు బారులు తీరారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మహిళలను కించ పరిచే విధంగా ఫోటోలు ప్రచురించడం దారుణమన్నారు. దేశంలో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. మద్యం పాలసీ వల్ల సుమారు 50 శాతం మద్యం వినియోగం తగ్గిందని కన్నబాబు వివరించారు.

# పరిశ్రమలలో తగు భద్రతా ప్రమాణాలను పాటించాలి




ప్రమాదాలు ఎల్జి పాలిమర్స్,రెండు ఫార్మా కంపెనీలలో ప్రమాదాలు సంభవించడం ద్వారా ప్రాణ నష్టం తో పాటు ప్రజలు భయాందోళనకు గురి కావడం జరిగిందన్నారు. జాతీయ స్థాయి ప్రత్యేక నిపుణులతో కూడిన హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికలో ముఖ్యంగా పరిశ్రమలలో ప్రోటోకాల్ ఉల్లంఘన మరియూ మానవ తప్పిదాల వలన ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారన్నారు. ఆగష్టు 2వ వారంలో రాష్ట్రస్థాయిలో పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాబట్టి అన్ని పరిశ్రమల యాజమాన్యం వారి మేనేజ్మెంట్ తో సమావేశాన్ని నిర్వహించుకొని గత సంవత్సరాలలో జరిగిన ప్రమాదాలు, ఇతర ప్రాంతాలలో గల ఫ్యాక్టరీలలో జరిగిన ఇన్సిడెంట్ లను పరిగణలోకి తీసుకొని ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకునే విధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే కొన్ని రోజుల పాటు ఫ్యాక్టరీ ను షట్ డౌన్ చేసుకొని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి తిరిగి పునః ప్రారంభించడం వలన సంబంధిత పరిశ్రమల యాజమాన్యానికి,సిబ్బందికి, ప్రజలకు, ప్రభుత్వానికి ఎటువంటి డామేజ్ ఉండదన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆర్కే మీనా మాట్లాడుతూ ఇటీవల పరిశ్రమలలో జరిగిన ప్రమాదాలు మానవ తప్పిదంగా గుర్తించడం జరిగిందన్నారు .పరిశ్రమల భద్రత పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సాంకేతిక నైపుణ్యం గల సిబ్బంది ని ప్రోటోకాల్ ప్రకారం విధులను నిర్వహించుకునే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాలలో మాక్ డ్రిల్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించినట్లవుతుందన్నారు. ఫార్మా కంపెనీల పరిసర ప్రాంతాల్లో హాస్పిటల్స్ ఉంటే, ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను వెంటనే ప్రాథమిక చికిత్స అందించే అవకాశం వుంటుందన్నారు.

ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యులు ఎం వి వి సత్యనారాయణ , గొట్టేటి మాధవి, శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి , జీ వి ఎం సి కమిషనర్ జి సృజన, జి ఎం డీ ఐ సి రామలింగరాజు, పారిశ్రామికవేత్తలు, అధికారులు హాజరయ్యారు.

# కలిసి జీవిద్దాం.. ఒకరికొకరు సహకరించుకుందాం

క్షయవ్యాధి సంస్థ, మైసూరులో కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ, అఖిల భారత వాక్, శ్రవణ సంస్థ (ఆలిండియా స్పీచ్, హియరింగ్ ఇనిస్టిట్యూట్) వంటి ఎన్నో సంస్థల ఏర్పాటుకు సంపూర్ణమైన మద్దతు అందించారన్నారు. బెంగళూరులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అభివృద్ధికి, విద్యార్థులకు ప్రోత్సాహకాల విషయంలోనూ ఆర్థిక సహాయం అందించారన్నారు. భారతీయ విలువలు, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని అలవర్చుకుని తర్వాతి తరాలకు అందించడంతో పాటు ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగించాలని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

# భీమిలిలో బీచ్ ప్రహరీ నిర్మాణం కోసం మత్స్యకారుల వినతి



భీమిలిపట్నం : భీమిలి సముద్ర తీర ప్రాంతం లో సుమారు 1984 లో నిర్మించిన సముద్ర ప్రహరీ హుదూద్ తుఫాన్ వల్ల పూర్తిగా సముద్రం కోత కు గురి అయ్యి ప్రహరీ మొత్తం ధ్వంసం అయిందని, దీని వలన ఇప్పుడు తీరప్రాంత మత్స్యకార ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మీడియా కు వివరించారు. 2014 హుదూద్ తుఫాన్ కు తీరప్రాంతం కోతకు గురి ఐన తరువాత స్థానిక నాయకులు అప్పటి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ ను అనేక సార్లు కలసి ప్రహరీ నిర్మాణం చేసి మత్స్యకారులను ఆదుకోవాలని కోరితే, అయన ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గా మిగిపోయాయని ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని జానకిరామ్ మీడియా కు తెలిపారు. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభం, తుపానుల కాలం అవటం వల్ల తీరప్రాంత గ్రామాలైన ఎగువపేట, బొయివీధి ప్రాంత ప్రజలు భయం తో కాలం గడుపుతున్నారని,గత ప్రభుత్వం కంటితుడుపు చర్యలు మాత్రమే చేసిందని, కానీ సమస్య ను పూర్తిగా పరిష్కారం చేయలేదని తెలిపారు. పైగా ఈ సముద్ర తీరం గుండా రోడ్డు ఉండటంతో, రోడ్డు కూడా కోతకు గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే మరియు జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్ ఈ సమస్య పై స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకొని సమస్య పరిష్కారానికి పూనుకోవాలని, మంత్రి నాయకత్వం మీద నమ్మకంతో ఎప్పుడు పనులు ప్రారంభం సవుతాయా అని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారని, కాబట్టి ఈ సమస్య పై అధికారులు, మంత్రి గారు స్పందించి ప్రజలకు మంచి జరిగే విధంగా కృషి చేయాలనీ వాసుపల్లి జానకిరామ్ మీడియా ద్వారా కోరారు.

### వైజాగ్ పటం ఛాంబర్ అఫ్ కామర్స్

## మహిళా విభాగం మాస్కుల వితరణ




విశాఖపట్నం : నగరంలో కోవిడ్-19 క్రమేణా విస్తరిస్తున్న సమయంలో మన ఆరోగ్యం మన బాధ్యత, మనకు భద్రత అనే నినాదంతో మాస్కును ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ధరించాలని చాటి చెప్పేందుకు వైజాగ్ పటం ఛాంబర్ అఫ్ కామర్స్ మహిళా విభాగం వారు ముందుకు వచ్చి నగరంలోని గోషాసుపత్రి , విశాఖ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్, కింగ్ జార్జి హాస్పిటల్ , మెంటల్ కేర్ మొదలగు ఆసుపత్రులలో మొదటివరసలో ఉండి అధిక రిస్కులో పని చేస్తున్న నర్సులు ఇతర సిబ్బంది వాడుకునేందుకు వీలుగా 2000 మాస్కులను వైజాగ్ వాలంటీర్లు సంస్థ సిబ్బందికి మరియు మానసిక ఆసుపత్రి డాక్టర్ రేఖ దత్ గారికి ఈరోజు దత్ ఐలాండ్ , సిరిపురం లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ రోజు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వైజాగ్ పటం చాంబర్స్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం అధ్యక్షులు డాక్టర్ శ్రీమతి యడవల్లి హేమ , కార్య దర్శి శ్రీమతి సంధ్య గోడే , ఉపాధ్యక్షులు శ్రీమతి జీజా వల్సరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కడవలమ్మ పండుగ

**- భక్తులకు దర్శనాల అనుమతి లేదు - ఆలయ ధర్మకర్త సనపల బంగార్రాజు**



మాధవధార : మాధవధార గ్రామ దేవతలైన కుంచుమాంబ, కనకమహాలక్ష్మి, కొత్తమహాలక్ష్మి పండుగలలో భాగంగా, ఆదివారం శ్రీ కొత్త మహాలక్ష్మ (కడవలమ్మ) పండుగను నిర్వహిస్తున్నట్లు పండగ కమిటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త బంగార్రాజు తెలిపారు. శనివారం ఉదయం ఆలయ ఆవరణలో మీడియా తో బంగారురాజు మాట్లాడుతూ పోలీసుల సూచనల ప్రకారం కోవిద్ - 19 నిబంధనలలో భాగంగా భక్తులకు దర్శనాలను కల్పించడం లేదని అన్నారు. మాధవధార గ్రామ ప్రజలు ఇంటి దగ్గరే అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని ఆయన కోరారు. పండుగను మాధవ యువజన సమాజం పర్యవేక్షిస్తుంది అన్నారు.

### కరోనాపై అవగాహన సదస్సు



గొలుగొండ : కోవిడ్-19పై మండల పరిషత్‌లో అధికారులతో సమావేశ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడతిఒ ఎస్.డేవిడ్‌రాజు, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్సై నారాయణ రావు, పిహెచ్‌సి డాక్టర్ ధనలక్ష్మీ, ప్రణతి సమావేశంలో పాల్గన్నారు. సచివాలయం పరిధిలో కమిటీలు ఏర్పాటు చేసి తద్వార కరోనాపై పర్యవేక్షణ చేయడం, అలాగే వైరస్ అనుమనితులను గర్తించి క్వారంటైన్‌లో ఉంచడం, నిర్ధారణ అయిన కేసులు ఎక్కడికి తరలించాలనే అంశాలపై దిగువ స్థాయి సిబ్బందికి సూచనలు అందజేసారు. అన్ని శాఖల అధికారు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మ్ మార్చండి మహాప్రభో

### టీడీపీ విశాఖ అర్బన్ జిల్లా కార్యదర్శి బిఎస్‌ఎంకే జోగినాయుడు



అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద ఉన్న ఎన్టీఆర్ కోలనీ, ట్రాన్స్‌ఫార్మ్‌ను వెంటనే మార్చాలని తెలుగుదేశంపార్టీ విశాఖ అర్బన్ కార్యదర్శి బిఎస్‌ఎంకే జోగినాయుడు డిమాండ్ చేసారు. ఆయన ఒక ప్రకనట విడుదల చేస్తూ మాట మాటకి ఓవర్‌లోడ్ వలన లైట్లు, ఫ్యాన్లు, కాలిపోతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మ్ చుట్టూ పెద్ద పెద్ద తుప్పలు పెరిగి పోయా యన్నారు. ప్రమాద కరంగా ఆ ప్రాంతం మారిందని చెప్పారు. పిల్లలు ఆడుకునే ప్రదేశం కావడం వలన ఏ ప్రమాదం సంబవిస్తుందో అనే భయంలో ప్రజలు ఉన్నారని, తెలిపారు. దీనికి సంభందించిన స్తంభాలకు వీధి దీపాలు ఉన్నాయని, అవి కూడా పాడైపోవడం జరుగుతుందని, తెలిపారు. ఇప్పటికే అనేక సార్లు వీధి దీపాల మార్చినా సమస్య మొదటికే వస్తుందని, చెప్పారు. వర్సాకాలం కావడం వలన మరిన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నా యన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రాన్స్‌ఫార్మ్ మార్చి శాశ్వత పరిష్కారం చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

### దోమలజోరు రక్తకండి మోడల్ కాలనీ పూర్తిచేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్న గిరిజనులు



అరకులోయ : మండలంలోని మాదల పంచాయతీ దోమల జోరు గ్రామంలో2014వ సంవత్సరంలో హుదూద్ తుఫాన్ కారణంగా నేలమట్టమైన ఇల్లులు గత ప్రభుత్వం హయాంలో మంజూరు అయినట్టు అధికారులు చెప్పడమే తప్ప నేటికి పది సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ కూడా మారుమూల పేద గిరిజనుల సమస్య ప్రజాప్రతినిధులకు గాని అధికారులకు గాని పట్టవని గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే కు విన్నవించారు సమస్యలుపరిష్కార దిశగా ఎవరూ ఆలోచించడం లేదని ఎమ్మెల్యేకు ఆవేదన వ్యక్తపరిచారు.

ఇప్పటికైనా తాము మా సమస్య గుర్తించి మోడల్ కాలనీ రోడ్డు అరకొరగా ఉన్న సమస్యలుపూర్తి చేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## 86వవార్డు ఫేస్-6 లో కరోనా నిర్మూలనకు శానిటైజేషన్




గాజువాక: 86వ వార్డు పరిధి ఫేస్-6 లో రాణి హైట్స్ అపార్ట్మెంట్ లో కరోనా పాజిటివ్ రావడంతో దామా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫేస్-6 ప్రాంతం మొత్తం శనివారం శానిటైజేషన్ చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర %జ.జు.జ% సభ్యులు దామా సుబ్బారావు మాట్లాడుతూ కరోనా కేసులు ఎక్కవవుతున్నాయని ఇది ప్రజలు గమనించాలని, కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ మస్కులను తప్పనిసరిగా ధరించి,పరిశుభ్రంగా ఉంటూ, భౌతిక దూరాన్ని పాటించాలని అన్నారు. అలాగే అందరు కూడా ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉండాలని అవసరాల నిమిత్తం బయటకు వచ్చినపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అని దామా అన్నారు.అలాగే ఎవరికి ఎటువంటి అనుమానం (కరోనా) ఉన్న లేదా ఎటువంటి సమస్య ఉన్న దామా సుబ్బారావు గారి నెంబర్ 9989355399 కి కాల్ చేసి తెలియజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది. అలాగే ఫేస్-2 లో గల ప్రశాంతి నగర్ నందు తేజ ప్యారడైజ్ అపార్ట్మెంట్ లో కూడా ఒక కరోనా పాజిటివ్ కేసు వచ్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దామా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

## వేల్పుల వీధిలో మాస్కులు పంపిణీ



అనకాపల్లి : అందరికి అందుబాటులో మాస్కులు,శానిటైజర్ లు అందుబాటులో ఉంచాలనే ఆకాంక్ష తో నే తమ నాయకుడు కొణతాల సీతారాం ఆకాంక్ష అని జై అనకాపల్లి సేన నాయకులు బొడ్డే డ మధు అన్నారు. శనివారంస్థానిక వేల్పులు వీధి రామాలయం వద్ద 8 వ రోజు మాస్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి సేన నాయకులు బొడ్డేడ మధు మాట్లాడుతూ కరోనా కట్టడికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సామజిక బాధ్యతతో అందరికీ మాస్కులు, శానిటైజర్ లు పంపిణీ చేయాలని తమ నాయకుడు కొణతాల సీతారాం సంకల్పం మేరకు పట్టణ పరిధిలో ఎనిమిది రోజులుగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్రపు నీల, సురభి హరీష్ ,కరణం గౌరీష్ , చందక మోహన్, అక్కిరెడ్డి బాబులు, కాండ్రేగుల కిరణ్ ,జోడా దిలీప్, అడపా నరేంద్ర, పెద్ద ఎత్తున మహిళా కార్య కర్తలు సీతారామ్ అభిమానులు పాల్గొన్నారు.

# టీడీపీ నేతలకు భయం పట్టుకుంది

### ఎమ్మెల్యే మేరుగ నాగార్జున



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతోందని ఎమ్మెల్యే మేరుగ నాగార్జున అన్నారు. దళిత సంక్షేమానికి పెట్టని కోటగా పరిస్థితి కొనసాగుతుంటే టీడీపీ నాయకులు భరించలేక పోతున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు రాజన్నదొర, చెట్టి ఫాల్గుణలతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికిన టీడీపీ నేతల మాటలు నీటి మీద రాతలే అయ్యాయి. సీఎం జగన్ మాత్రం ఏడాది కాలంలోనే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఆయనలో అంబేద్కరిజం కనిపిస్తోంది. ఈమధ్య టీడీపీ నాయకులు ఢిల్లీ వెళ్తే ప్రజల ప్రయోజనాల కోసం ఏమైనా అడుగుతారేమోనని అనుకున్నాను. కానీ స్కాం కేసులో ఇరుక్కున్న మాజీ మంత్రులను విడిచిపెట్టాలని రాష్ట్రపతిని కలిశారని తెలిసింది. మాజీ సీఎం చంద్రబాబు సహాయకుడు శ్రీనివాసరావు అక్రమాస్తులు బయట పడినప్పుడు, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికినప్పుడు ఈ విషయం రాష్ట్రపతికి తెలియజేశారా?' అంటూ ప్రశ్నించారు.టీడీపీ పాలనలోచంద్రబాబు సొంతంగా రాజ్యాంగాన్ని అమలు చేశారే తప్పా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఎక్కడా అమలు చేయలేదు. చంద్రబాబుకు రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం లేదని, గతంలో అన్ని రంగాలను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషనర్‌గా న్యాయ కోవిదుడైన దళితుడిని నియమిస్తే ఎందుకు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం మూడు ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని సీఎం జగన్ ఆలోచనలు చేస్తుంటే టీడీపీ నేతలు అమరావతిలో వ్యాపారాల కోసం అక్కడ ఉద్యమాలు చేస్తున్నారన్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుకున్నారని మేరుగ నాగార్జున తెలిపారు.

**అభివృద్ధి భయం పట్టుకుంది: రాజన్నదొర**

విశాఖ కేంద్రంగా ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ ఏర్పాటు స్వాగతిస్తున్నామని సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర అన్నారు. ఐదేళ్లు ఉత్తరాంధ్రను పట్టించుకోని టీడీపీ నాయకులు.. ఇప్పుడు సీఎం జగన్ అభివృద్ధి చేస్తుంటే మాత్రం అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో గిరిజనులకు ఎంత ఖర్చు చేశారో, తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే ఎంత ఖర్చు చేశామన్నదానిపై చర్చకు సిద్ధమని రాజన్నదొర అన్నారు. టీడీపీ నాయకులకు జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి మంత్రం భయం పట్టుకుందని అన్నారు. టీడీపీ హయాంలో గిరిజనులకు మంత్రి పదవి ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. శవ రాజకీయం కోసం అర్హత లేని వ్యక్తికి ఆరు నెలలు మంత్రి పదవి ఇచ్చి మధ్యలోని తీసేసారంటూ దుయ్యబట్టారు. టీడీపీ ఐదేళ్ల కాలంలో కనీసం గిరిజన సలహా మండలి కూడా నియమించలేదని రాజన్నదొర పేర్కొన్నారు.

**చంద్రబాబునాయుడు గిరిజనుల ద్రోహి**

సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను ఆదరించారని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. బీసీ ,ఎస్సీ ఎస్టీ మహిళలకు మంత్రులు, ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గిరిజనులకు భూమి పట్టాలిస్తే ఇప్పుడు సీఎం జగన్.. నాలుగింతలు ఎక్కువగా భూమి పట్టాలిచ్చారని పేర్కొన్నారు.

టీడీపీ ఐదేళ్ల పాలనలో చంద్రబాబునాయుడు బాక్సైట్ తవ్వకాల పేరిట గిరిజనుల ఆస్తులను దోచుకోవడానికే ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నరసాపురం లో కేజీబీవీ జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

- గ్రామీణ బాలికలకు ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



**నరసాపురం కేజీబీవీ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**

చోడవరం : మండలంలోని నర్సాపురం గ్రామంలో కేజీబీవీ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని బాలికా విద్యను మరింత ప్రోత్సహించేందుకు వైసీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేసిందన్నారు. కేజీబీవీ జూనియర్ కళాశాల ఏర్పాటు, పాఠశాల అభివృద్ధి కి కోటి 60 లక్షలు తో ఆధునీ కరించడం జరుగుతుందన్నారు. అనంతరం పి ఎస్ పేట లో కోటి 8 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్య క్రమంలో, సమగ్ర శిక్ష అభియాన్ పి డి మల్లి కార్జున రెడ్డి, వైసిపి నాయకులు ఏడువాక సత్యారావు, సరగడం సిమ్ము నాయుడు, పల్లా నర్సింగ్ రావు ,, బొడ్డేడ సూర్యనారాయణ, దాడి గంగరాజు, ముల్లి సోమ నాయుడు, అప్పికొండ లింగబాబు, నడి పిల్లి దేముడు, శరగడం నాగేశ్వరరావు, స్థానిక నాయకులు దొడ్డి హనుమంతరావు, దేవి, ఎంఈఓ పి.అచ్యుత రావు, కె వి ఎం నాయుడు , కేజీబీవీ సి ఆర్ టి లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి'

విశాఖపట్నం : కొవిడ్-19 నియంత్రణలో భాగంగా విధులను నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏడీసీపీ(పరిపాలన) రజని పేర్కొన్నారు. నగర పోలీసు కమిషనర్ ఆర్కే మీనా ఆదేశాలతో ఏసీపీల పరిధిలోని పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో పాటు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా కొవిడ్ బారిన పడుతుండటంతో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

### 800 లీటర్ల సారా పులుపు ధ్వంసం



అచ్యుతాపురం : మండలంలో నరేంద్రపురం గ్రామంలో నాటు సారా కాసేందుకు సిద్ధం చేసిన బట్టీని ఎక్సైజ్ సీఐ పి కృష్ణారావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు . శనివారం సీఐ కృష్ణారావు తన సిబ్బందితో కలిసి నాటు సారా స్థావరాలపై దాడులు చేసి 800 లీటర్ల సారా పులుపు ధ్వంసం చేసి , 10 లీటర్ల సారాను స్వాదీనం చేసుకున్నామని తెలిపారు . సారా కేసులలో చట్టాలు మారాయని, పట్టుబడితే శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

**ఉత్తర రైల్వే**

ఇ-ప్రొక్యూర్‌మెంటు పద్ధతి ద్వారా టెండర్ల ఆహ్వానం

టెండరు ప్రకటన నెం:09/2020/2021 తేది: 17.07.2020

భారత రాష్ట్రపతి కొరకు మరియు తరపున ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజరు, ఉత్తర రైల్వే, న్యూఢిల్లీ-110001 వారు క్రింద పేర్కొన్న ఐటమ్‌ల సరఫరాకై ఇ-ప్రొక్యూర్‌మెంటు పద్ధతిన ఇ-టెండర్లు కోరుచున్నారు.

| క్ర. సం | టెండరు నెం. | సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేది |
|---|---|---|---|---|
| 1 | 09202586 | సెకండరీ లాషింగ్ చెయిన్ డ్రాయింగ్ నెం.డబ్ల్యూడి-82054-ఎస్-14 | 829 నెంలు | 17.08.2020 |
| 2 | 09202202 A | పూర్తి స్లాక్ అడ్జస్టర్ ఐఆర్‌ఎస్‌ఎ-750 | 182 నెంలు | 17.08.2020 |

గమనిక-1. వివరాలకై విక్రేతలు IREPS వెబ్‌సైటు అనగా www.ireps.gov.in లో చూడగలరు.
2. మ్యాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.

1577/20

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

# విజయభాను సంపాదకీయం

## విద్యను వదిలేసి...

నటన మీద ప్రేమతో ఉన్నత విద్యను వదిలేసి... ముందు బుల్లితెర మీద, తర్వాత సినీ సీమలో ఎదిగిన ఒక మధ్యతరగతి బీహార్ యువకుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ 34 ఏండ్ల వయస్సులో ప్రాణం తీసుకోవడం చర్చనీయాంశమైంది. బాలీవుడ్‌ను గుప్పెట్లో ఉంచుకున్న కొందరు ప్రముఖుల వల్ల అవకాశాలు కోల్పోయి సుశాంత్ ఉక్కిరిబిక్కిరై ఊపిరితీసుకున్నాడనిబీ బంధుప్రీతి, భజనపరుల పక్షపాతం తప్ప టాలెంట్‌కు సినీ పరిశ్రమలో విలువే లేదని పలువురు వాపోతున్నారు. ఒక్క సినీ పరిశ్రమే కాదు, ప్రతిభను తొక్కేయడం, ఖూనీ చేయడం అన్నిరంగాల్లో అప్రతిహతంగా సాగుతూ కనిపించని విషాదానికి కారణమవుతున్నది.

అత్యంత ప్రతిభావంతుడైన ఒక శిల్పి ఉండేవాడు. జీవం ఉట్టిపడేలా రాళ్లను మలచడంలో దిట్ట. ఉలితో రాళ్లకు ప్రాణ ప్రతిష్ఠ చేసే ఈ శిల్పికి చావంటే భయం. మృత్యుంజయుడై శాశ్వతంగా భూమ్మీద ఉండిపోవాలన్నది శిల్పి సంకల్పం. అందుకోసం అచ్చుగుద్దినట్లు తనలానే ఉండే కొన్ని శిల్పాలను చెక్కి ఇంట్లో ఉంచుకున్నాడు. ఆ శిల్పాల మధ్య తానుంటే.. యముడు వచ్చినా తనను కనుక్కోలేడని, ఆ విధంగా చావును తప్పించుకోవచ్చన్నది శిల్పి ప్లాన్.

అంత్యకాలం దాపురించింది. యముడు రానే వచ్చాడు. శిల్పిని పిలిచాడు. తనలా ఉండే శిల్పాల మధ్య ఉన్న మనవాడు ఉలకలేదు, పలకలేదు. యముడు తికమకపడి వెళ్ళిపోయాడు. మర్నాడు మళ్ళీ వచ్చాడు. శిల్పిని పిలిచాడు. శిల్పి అదే పథకంతో యముడిని బురిడీ కొట్టించాడు. ఒట్టి చేతులతో యముడు వెనుదిరిగాడు. ఈ సమస్య పరిష్కారానికి యముడు ఒక ఎత్తు వేశాడు. మూడోరోజు శిల్పి ఇంటికి వచ్చిన యముడు.. ఈసారి ఆయన్ను పిలవలేదు. వస్తూనే.. వహ్వా.. ఎవరీ ప్రతిభావంతుడైన శిల్పి? ఏమా ప్రతిభ! ఆశ్చర్యం, అద్భుతం. ఒకేరకమైన శిల్పాలను ఒకేలా చెక్కిన ఈ శిల్పి ప్రతిభాచతురత అనన్యసామాన్యం.. అని అన్నాడు. తన ప్రతిభను పొగిడేసరికి శిల్పి తబ్బిబ్బై.. చావు తప్పించుకోడానికి వేసిన పథకాన్ని పూర్తిగా మరిచిపోయి... 'థాంక్స్ సార్.. ఇవి చెక్కిన శిల్పిని నేనే..' అని చెప్పి యముడికి దొరికిపోతాడు.

జీవితంలో ప్రశంస చేసే మేలును తెలియజేయడానికి చెప్పే ఈ కథలో మరొక మంచి సందేశం దాగి ఉంది. ప్రతిభావంతుడికి ఇతరులు ఇచ్చే మెచ్చుకోలు కిక్కును, దాని మహత్యాన్ని ఇది స్పష్టంచేస్తున్నది. ప్రతిభ అనే తీగ పైపైకి పాకి పుష్పించి వికసించడానికి ప్రోత్సాహం అనే పందిరి కావాలి. ఆ ఆసరా దొరక్కపోతే కొద్దిదూరం పాకి ఎదగలేక ప్రతిభ ఎండిపోతుంది. ప్రతి మనిషిలో, ఆ మాటకొస్తే ప్రతి జీవిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. అది గుర్తించి ప్రతిభావంతుడి భుజంతట్టి ప్రోత్సహిస్తే ఆ ప్రతిభ ద్విగుణీకృతమై అద్భుతం సృష్టిస్తుంది. అట్లాకాకుండా, కులం, ప్రాంతం, రంగు, హోదా లాంటి పిచ్చిపిచ్చి కొలబద్దలను పెట్టుకుని ఆ ప్రతిభను పథకం ప్రకారం అడ్డుకుని ఖూనీ చేసే ప్రయత్నం చేస్తే.. సుశాంత్ రాజ్‌పుత్ మాదిరిగానో, ఉదయ్‌కిరణ్‌లాగానో ఊపిరి తీసుకుంటుంది. కళపై పిచ్చి మమకారంతో స్వయంకృషితో ఎదగాలనుకునే ఇలాంటివాళ్లను వెన్నుతట్టి ప్రోత్సహించకపోయినా తట్టుకుంటారేమోగానీ.. ఎదుగుదలను అడ్డుకుంటే నిస్సహాయులై అర్ధంతరంగా వైదొలుగుతారు.

డబ్బు, గ్లామర్ సమాగమమైన సినిమా రంగంలో ఈ టాలెంట్ హననం ఎక్కువ ఉండటానికి కారణం.. పరిశ్రమ కొన్ని కుటుంబాల కబంధహస్తాల్లో బందీ అయిపోవడమే. బొమ్మ తీయాలన్నా, హాల్లో ఆడాలన్నా.. ఈ కుటుంబీకుల అండదండలు, ఆశీస్సులు ఉండాలి. ఇలాంటి వాతావరణంలో.. కిందిస్థాయి నుంచి అడుగడుగునా కష్టపడి పైకొచ్చే ప్రతిభావంతులు ఇతరేతర శక్తులు అడ్డుపడుతుంటే ఒక దశలో ఆగిపోక తప్పని పరిస్థితి! బుల్లితెర మీద పాడుతా తీయగా, జబర్దస్త్ వంటి ప్రతిభాన్వేషక కార్యక్రమాలు ఉండబట్టి సరిపోయింది గానీ లేకపోతే మట్టిలో మాణిక్యాలు శాశ్వతంగా సమాధి అయివుండేవి. ఏ గాడ్‌ఫాదర్ లేని గెటప్ శీను లాంటి అత్యంత ప్రతిభావంతుడైన నటుడు ఎన్నేళ్ళని ప్రతిభను నిరూపించుకుంటూ పోవాలి?

అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేని విధంగానే టాలెంట్‌ను అడ్డుకోవడం కష్టం.

## నిండిన జూరాల.. శ్రీశైలానికి వరద ప్రవాహం



గద్వాల: జోగులాంబ జిల్లాలోని జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరింది. దీంతో ఎనిమిది గేట్లు ఎత్తి 83,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లుకాగా, ప్రస్తుతం 318.100 మీటర్ల వరకు నీరు ఉన్నది. దీంతో డ్యాంలో ప్రస్తుతం 8.810 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. జలాశయం పూర్తిగా నిండితే 9.657 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. అయితే ఎగువనుంచి 75 వేల క్యూసెక్కుల నీరు డ్యామ్‌లోకి వచ్చి చేరుతుండటంతో అధికారులు ఎనిమిది గేట్లను ఎత్తివేశారు.

**శ్రీశైలం వైపు కదులుతున్న కృష్ణమ్మ**

జూరాల నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. జూరాల నుంచి మొత్తం 87,317 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం బరాజ్‌లోకి 86,203 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులుకాగా, ప్రస్తుతం 831.40 అడుగుల నీరు ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 215.80 టీఎంసీలు. అయితే ఇప్పుడు డ్యాంలో 55.87 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. శ్రీశైలం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## అమెరికాలో మరోసారి షట్‌డౌన్ తప్పదేమో



వాషింగ్టన్: అమెరికాలో పెరుగుతున్న కరోనా కేసులు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) హెచ్చరించింది. కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండడంతో మరోసారి షట్‌డౌన్ తప్పకపోవచ్చునని పేర్కొంది. రాబోయే కాలంలో డిమాండ్‌ను పెంచేలా ప్రజలకు ప్రభుత్వం మరింత చేయూతనందించాల్సిన అవసరం ఉంటుందని తెలిపింది. అలాగే క్రమంగా విస్తరిస్తున్న పేదరికం, ఆరోగ్య వ్యవస్థలో ఉన్న లోపాలు వంటి సమస్యల్ని అధిగమించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ఓ నివేదికలో సూచించింది. ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచేందుకు అమెరికా అనేక చర్యలు చేపట్టినప్పటికీ.. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్థూల జాతీయోత్పత్తి 37 శాతం తగ్గిందని ఐఎంఎఫ్ గుర్తుచేసింది. స్థూలంగా ఈ ఏడాది ఆర్థిక వృద్ధి 6.6 శాతం కుంచించుకుపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. ఫ్లోరిడా, జార్జియా, టెక్సాస్, కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో స్థానికంగా ఇప్పటికే మరోసారి ఆంక్షల్ని విధించిన విషయాన్ని ఐఎంఎఫ్ గుర్తుచేసింది. తాజా పరిస్థితులు హిస్పానిక్, నల్లజాతీయుల వంటి అల్పాదాయ వర్గాల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. వివిధ రంగాల్లో ఇప్పటికే నమోదవుతున్న నష్టాలు పెరుగుతున్న పేదరికాన్ని సూచిస్తున్నాయని తెలిపింది. రాబోయే కొన్ని నెలల్లో అమెరికా మరో దఫా ఉద్దీపన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐఎంఎఫ్ సూచించింది. డిమాండ్‌కు ఊతమిచ్చేలా, ఆరోగ్య వ్యవస్థ అప్రమత్తతను మెరుగుపరిచేలా, అట్టడుగు వర్గాలకు దన్నుగా నిలిచేలా ఉద్దీపన కార్యక్రమాలు ఉండాలని సూచించింది. ఇప్పటికీ ఆర్థికపరమైన వెసులుబాట్లు ఉన్న కారణంగా వీలైనంత త్వరగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపింది. అలాగే ఈ సంక్షోభాన్ని సామాజిక భద్రత వంటి శాశ్వత పరిష్కారాలను చూపేందుకు అవకాశంగా మలచుకోవాలని హితవు పలికింది.

## 14 వేల మద్యం బాటిళ్లు ధ్వంసం



మచిలీపట్నం : గడిచిన రెండు నెలలుగా తెలంగాణ నుంచి కృష్ణాజిల్లాలోకి అక్రమంగా తరలించిన సుమారు రూ.70 లక్షల విలువ చేసే 14వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న జిల్లా పోలీసులు ఇక్కడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఎక్సైజ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ డైరెక్టర్ సీహెచ్‌డీ రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి జిల్లాలోకి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని జిల్లా పోలీసులు కట్టడి చేసిన తీరు అభినందనీయమన్నారు.

## దర్శనాలు ఆపండి : రమణ దీక్షితులు



తిరుమల: శ్రీవారి ఆలయ గౌరవ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు మరోసారి ట్విటర్‌లో స్పందించారు. కొన్ని వారాల పాటు శ్రీవారి దర్శనానికి భక్తుల అనుమతి నిలిపివేయాలని తితిదే అధికారులకు సూచించారు. శ్రీవారికి కైంకర్యాలు నిర్వహించే అర్చకుల స్థానాన్ని మరొకరు భర్తీ చేయలేరని, అర్చకులను సంరక్షించి స్వామివారికి పూజలు ఏకాంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో 50 మంది అర్చకులు పని చేస్తున్నారని..వారిలో 15 మంది కొవిడ్ బారిన పడినా తితిదే ఈవో, అదనపు ఈవో శ్రీవారి దర్శనాలను ఆపడంలేదని తితిదే ఆగమ సలహా మండలి గౌరవాధ్యక్షుడు రమణ దీక్షితులు గురువారం ట్విటర్‌లో విమర్శించిన విషయం తెలిసిందే.

## కవి సమయం

### 'విజయ రహస్యం'

కాలం, ఖర్మం కలిసి రాలేదంటూ
జాతక చక్రం అనుకూలంగా లేదంటూ
జీవితంలో ప్రగతి సాధించలేకపోవుటకు
నెపాన్ని ఇతరులపై నెట్టేసి
నిమ్మకు నీరెత్తినట్లు హాయిగా
కూర్చునే వారు అధమాధములు
విజయం సాధించుటకు
తగిన మూల రహస్యం, సూత్రం
తమలోనే వున్నదని గ్రహించి
పట్టుదల, దీక్ష తపనలతో
క్రమబద్ధమైన ప్రణాళికతో
ధైర్యే సాహసే లక్ష్మీ అంటూ
ముందుకు సాగిన వారు ఉత్తములు
అనితర సాధ్యమైన విజయాలు వారికే స్వంతం

...కవితా రచన
సి. ప్రతాప్

## పంచాంగం

| మాసం : ఆషాడం ; తిథి : చతుర్ధశి రా.11.14; ఆర్ధ్ర రా.9.37; ఉ.శే.వ.7.10వ | ఆదివారం 19-07-2020 |
|---|---|

**మేషం** : దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు. దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికా కులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిథునం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి.

**కర్కాటకం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెల కొంటుంది.

**సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొంద గలుగు తారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంత మవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి.

**వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం.ప్రముఖులను కలుసు కుంటారు.

**కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవు తాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్య లెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

**మీనం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి వారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

# హిందువుల పుణ్యస్థలి బాలి

## సంకీర్తన



అత్యధిక ముస్లిం జనాభా వున్న ఇండోనేషియాలోని బహు చక్కని దీవి బాలీ. బాలీలో అత్యధిక భాగం హిందువులే ఉన్నారు. దీన్ని దేవతల నివాసంగా పిలుస్తారు. అంత ప్రశాంతంగా, మనోహరంగా ఉంటుంది. 2.5 మిలియన్ల జనాభాలో 90శాతం హిందువులే ఉన్నారు. తమను ప్రశాంతంగా ఉండేట్టు చేయమని, ఎలాంటి ఆపదలు రాకుండా కాపాడాలని కోరుతూ ప్రతీ ఇంటా పూజలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఆ మంత్రోచ్చారణ అంతటా వినవస్తూంటుంది. ప్రతీ దేవాలయంలోనూ సాయింత్రాలు పూజలు, మంత్రాల పఠనంతో ఆధ్యాత్మిక వాతావరణం కట్టేస్తుంటుంది. పలు దేశాల నుంచీ ఎందరో పర్యాటకులు వస్తూ పోతున్నప్పటికీ ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలకు మాత్రం ఎలాంటి ఆపదా కలగలేదు. ఇక్కడి ప్రధాన మతం ఆగమ హిందూ ధర్మం. 11వ శతాబ్దంలో సుమత్రా, జావాల్లో హిందూ ప్రచారం బాగా జరగడంతో బాలీలో ఆగమ హిందూ ధర్మం ఏర్పడింది. భారతదేశం నుంచీ వచ్చిన మతమే అయినప్పటికీ బాలీలో హిందు, బౌద్ధ, జావా మతాలు ఆచారంలో ఉన్నాయి. 15వ శతాబ్దంలో జావాకు ఇస్లాం రావడంతో అక్కడి కళాకారులు, సంగీతకారులు అనేకమంది బాలీకి పారిపోయారంటారు.

**సృజన సంపన్నులు:**

బాలీ ప్రజలు ఎంతో సృజన సంపన్నులు. సంప్రదాయసిద్ధమైన శక్తి సామర్థ్యాలు ఎక్కువగా మతపరమైన కార్యకలాపాలకే వినియోగిస్తారు. రామాయణం, భారతం పట్ల అపార భక్తి శ్రద్ధలున్నాయి.వాటిలోని కథలతో ఇక్కడి ప్రజలు స్ఫూర్తి పొందుతున్నారు. ప్రతీ పండుగ, సందర్భం ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా, కళాత్మకంగా చేసుకోవడం వారి ప్రత్యేకత. ప్రతీ పనిలోను, ప్రతీ అంశంలోనూ సౌందర్యం తొణికిసలాడుతుంది. వారిది కళా దృష్టి కావడమే అందుకు కారణం.

**అందమైన పల్లె కూటా:**

బాలీలోని దిన్‌పాసార్, సింగరాజా పట్టణాలు ఎంతో బావుంటాయి. టూరిస్టులను అమితంగా ఆకట్టుకుంటున్న కూటా బాలీ విమానాశ్రయానికి సమీపంలోనే ఉంది. ఇదో కుగ్రామం. ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.1970ల నుంచీ పర్యాటకుల రాక ఎక్కువయింది. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ తన 'సాగరిక' అనే కవిత 80ఏళ్ల క్రితం ఇక్కడ పర్యటనికి వచ్చినపుడు రాశారు. "విదేశీయునిగా నేను మొదటగా ఇక్కడికి వచ్చినపుడు ఆరాతి తీరంలో నువ్వు కూర్చుని వున్నావు. నన్ను ఆహ్వానించావు. మనం ఇద్దరం పువ్వుల్ని సేకరించాం. నేను మరోసారి వచ్చినపుడు నువ్వు వాణిజ్య రాకుమారుడివి. మళ్లీ నన్ను ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించావు. దేవతలను కలిసి ప్రార్థించాం. నా ఆస్తులు తరగిపోయాయి. ఇవాళ నా వీణతో వచ్చాను.

# కరోనా సహాయకుడుగా మోటూరు సన్యాశినాయుడు



పరవాడ : పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ గల సచివాలయం లో పనిచేస్తున సెక్రట్యరీ, వీఆర్వో, సచివాలయం సిబ్బంది, వాలెంటర్లీ మొత్తం26 మందికి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు జనసేన పార్టీ ఆధ్వ ర్యంలో పెందుర్తి నియోజవర్గ నాయకులు మోటూరు సన్యాసినాయుడు ఆర్థికసాయం తో కెఎన్ 95 మాస్కులు అలాగే శానిటైజర్ జర్లును ఒక్కొక్కరికి రెండేసి చొప్పున అందజేశారు. అనంతరము మోటూరు హరి బాబు ఆర్థిక సాయం తో పారిశుద్ధ్య కార్మికులకు 25 కేజీలు బియ్యం, పది రకాల కిరాణా సామాన్లు, ఏడు రకాల కాయగూరలు, ఒక జత బట్టలును అందజేసి కరోనా సహకుడుగా నిలిచారు. కరోనా వంటి విపత్కర సమయంలో తనకు తోచిన చిరు సహాయం చేసాను అని ఈసందర్భంగా అయన అన్నారు.

తదనంతరము సన్మాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈయన చేసే సేవా కార్య క్రమాలుకు పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రావాడ గ్రామ పంచా యతీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్రోణంరాజు శ్రీనివాస్ సహకారంతో...

# నిరుపేద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేసిన వివేకానంద సేవా సంస్థ

**- మహిళ సేవకులకు శానిటైజర్లు, మాస్కులు అందజేత - పేద కుటుంబాలను ఆదుకోవడం కోసం 120 రోజులుగా అలుపెరగకుండా సేవా కార్యక్రమాలు**



విశాఖపట్నం : ద్రోణంరాజు శ్రీనివాస్ సహకారంతో నల్లవారి వీధిలోని నిరుపేద కుటుంబాలకు శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ కూరగాయలు పంపిణీ చేసింది. సంస్థకు చెందిన మహిళా సేవకులు ప్రతి నిరుపేద ఇంటికి వెళ్లి కూరగాయలు అందజేశారు. మహిళా సేవకు లను కరోనా నుంచి రక్షించడం కోసం వారికి శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. కరోనా నేపథ్యంలో నిరుపేద కుటుం బాలు ఆకలితో అవస్థలు పడకూడదనే ఆశయంతో 120 రోజులుగా నిర్వి రామంగా.. అలుపెరగకుండా.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కరోనా మహమ్మారి కారణంగా జీవనోపాధి లేక నిరుపేద కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల కడుపు నింపడం కోసం భారీ స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. స్థాని కంగా ఉన్న ప్రతీ నిరుపేద కుటుంబానికి బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు, శానిటైజర్లు, మాస్కులు సబ్బులు పంపిణీ చేశామని తెలియజేశారు. ప్రభుత్వ ఘోషా ఆసుపత్రిలో ఉండే గర్భిణీలకు, బాలింతలకు, వారి సహాయకులకు, భవన నిర్మాణ కార్మికులకు, రిక్షా కార్మికులకు, కూరగాయల రైతులకు, ఆటో కార్మికులకు, ఆరోగ్య సిబ్బందికి, జివి యంసి పారిశుద్ధ్య సిబ్బందికి, పోలీసులకు, హమాలీలకు ఉదయం అల్పాహారాలు రాగి జావ, మధ్యాహ్నం భోజనాలు, రాత్రి భోజనాలు పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి ఉమాదేవి, అచ్యుత, సుజాత, రాణీ, నాగమణి, భవాని, లక్ష్మి పాల్గొన్నారు.



**57 వ వార్డు సుభాష్ నగర్ లో ఉన్న చాకలి వీధి ధోబి కానలో షార్ట్ సర్క్యూట్ వల్ల వాటర్ మోటారు, సర్వీస్ వైరు పాడైపోవడం జరిగింది. దీనిమీద సుమారు 30 కుటుంబాలు బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా నీటి సమస్య వలన పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య శివయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ దాసరి శివశంకరరావు దృష్టికి రావడంతో స్పందించి సర్వీస్ వైర్ మార్పించి మోటార్ రిపేర్ చేయడం జరిగింది. శనివారం ఉదయం మోటర్ ప్రారంభించి నీళ్లను వదిలారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల అప్పలరాజు, రండి పైడి రాజు, టెక్కెం సన్యా సిరావు, కొరివాడా ఈశ్వరరావు, సూరికొండ సత్యనారాయణ, రండి రాము, కొరివాడా చిన్నా రావు తదితరులు పాల్గొన్నారు.**



**29వ (పాత 20వ )వార్డ్‌లో అంగడిదిబ్బ పరిసర ప్రాంతాలలో వార్డ్ టీడీపీఅభ్యర్థి బొట్ట సన్నమ్మ & అప్పలస్వామి ఛారిటబెల్ ట్రస్ట్ అధ్యక్షుడు బొట్ట పరదేశి యాదవ్ ఆధ్వర్యంలో అర్బన్ మలేరియా అధికారులు గంగాధర్, ప్రసన్నలు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగి రమణ, రాయన బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.**

## శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో

# శ్రావణమాస శ్రీలక్ష్మి పూజలు



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, జగజ్జనని, లోక కళ్యాణి, అష్టైశ్వరి ప్రదాయిని అయిన శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం శ్రావణమాసం సందర్భంగా లోక కళ్యాణార్థం, భక్త జనుల అభీష్టం నెరవేర్చుటకు గాను స్వస్తిశ్రీ శర్వారినామ సంవత్సర శ్రావణ పాఢ్యమి ప్రభృతి తేది:21-07-2020 నుండి 19-08-2020 వరకు శ్రీ కనకమహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రతీ నిత్యము ఉదయం 8.00 గం..ల నుండి గం.. 10.30 ని..ల వరకు శ్రావణ లక్ష్మి కుంకుమ పూజలు, మహాలక్ష్మి హెూమం ఆర్జిత సేవలుగా పరోక్షంగా నిర్వహించబడును.

**శ్రావణ ప్రత్యేక పర్వదినములు, పూజలు**

24-07-2020- మొదటి శుక్రవారం, 31-07-2020- రెండవ శుక్రవారము 'వరలక్ష్మి వ్రతం', 07-08-2020- మూడవ శుక్రవారము 14-08-2020- నాల్గవ శుక్రవారము 03-08-2020 శ్రావణ పూర్ణిమ 19-08-2020 ఆఖరి రోజు అగు శ్రావణమాసం 'శ్రావణ మాస విశిష్ట కుంకుమ పూజ, లక్ష్మి హెూమం పూర్ణాహుతి"తో ముగించ బడును. శ్రీ అమ్మవారి భక్త జనులకు విజ్ఞప్తి, కోవిడ్-19 నియమ నిభంధనలు కారణంగా ప్రతి సంవత్సరము సామమూహికంగా శ్రావణమాసం నెల మొత్తం నిర్వహించు సామోహిక కుంకుమార్చనలకు బదులుగా పరోక్షంగా నిర్వహించబడును. ఆసక్తి గల భక్తులు ఆంధ్ర బ్యాంక్, కొత్తరోడ్, అకౌంట్ నెం. 0608100 11006691 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎఎన్‌డిబి 00608లో చెల్లించవచ్చును.

ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసినవారు మీ యొక్క ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించ వలసిన వారి పేరు, గోత్రనామాలు ఈ క్రింది ఫోన్ నంబర్లకు తెలియపరచవచ్చును. ఫోన్/ వాట్సప్ నెంబర్లు : 9550758133, 63022 60299, 9291284550 లేదా ఇమెయిల్ id endow- eokanaka@gov.inపంపవచ్చును.

వీటితో పాటు ఈ క్రింది ఆర్జిత సేవలకు కూడా పై నెంబర్ల నందు సంప్రదించవచ్చును.

1. అమ్మవారి అష్టోత్తర కుంకుమ పూజ రూ. 50/- 2. అమ్మవారి క్షీరాభిషేకం రూ. 200/- 3.అమ్మవారి పంచామృతాభిషేకం రూ. 516/- 4. శ్రీ అమ్మవారి అష్టధళ పద్మారాధన రూ. 1116/- (ప్రతి మంగళవారం) చక్రనవవర్ణార్చన, లక్ష్మి హెూమం రూ.2516/- (పౌర్ణమి రోజున మాత్రమే).

# కౌలు రైతు గుర్తింపు కోసం గ్రామసభలు



దేవరాపల్లి : ఈనెల 20 నుండి కౌలు రైతు గుర్తింపు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జె. రమేష్ బాబు, మండల వ్యవ సాయ అధికారి ఎం. వాసుదేవ రావు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కౌలు రైతుకు సహకారం అందించే దుకు గాను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. భూ యజ మానికి హక్కు భంగం కలగ కుండా, భూ యజమాని సాగు హక్కు పై సంతకం చేయడం వల్ల భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది రాకుండా 2019 సెక్షన్ 5 బి ప్రకారం భూమిపై యజమానికి సర్వ హక్కులు ఉంటాయనియన్నారు.

కౌలుదారు రక్షణ చట్టం 1956 రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ఈ గ్రామ సభలో రెవెన్యూ, వ్యవసాయ, బ్యాంక్ అధికారులు పాల్గొని కౌలు రైతును గుర్తించడం జరుగుతుందన్నారు. వీరికి సిసిఆర్‌సి కార్డు లను జారీ చేసి బ్యాంకు ద్వారా రుణాలు అందించే దుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు ఈనెల 20 నుండి ఆగస్టు 7 వరకు గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్ కుమార్ ఉన్నారు.

## వర్తక సంఘాలు లాక్‌డౌన్ పాటించేందుకు

# ముందుకు రావడం చాలా మంచి నిర్ణయం

**జిల్లా అధ్యక్షులు ఎం.రవీంద్ర**

విశాఖపట్నం : కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నగర పరిధిలో లాక్ డౌన్ పాటించేందుకు వర్తక సంఘాలు ముందుకు రావడం చాలా మంచి నిర్ణయం అని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం. రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఉదయం 6:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మాత్రమే దుకాణాలను తెరిచి ఉంచుతామని, ఆ తరువాత దుకాణాలను మూసివేస్తామని విశాఖ మర్చంట్స్ అసోసియేషన్ వర్తక సంఘం ప్రతినిధులు వెల్లడించారు. అదే విధంగా ప్రజలందరూ కూడా తగిన జాగ్రత్తలు తీసుకొంటూ కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడంలో అధికారులకు సహకరించాలని, లేనియెడల కరోనా పాజిటివ్ రోగులకు సరిపడినన్ని పడకలు ఆసుపత్రులలో అందుబాటులో లేవని, పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగితే ప్రాణనష్టం కూడా పెరుగుతుంది కాబట్టి స్వీయ నియం త్రణ పాటించాలని విశాఖ ప్రజలను కోరారు.

# మాజీ ఎమ్మెల్యే ఎంవివి వర్ధంతి



సత్యనారాయణ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురం గ్రామంలో 13వ వర్ధంతి సందర్భంగా గ్రామ పెద్దలు, యువత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.

చింతపల్లి నియోజకవర్గంలో గొలుగొండ మండలం ఉన్న సమయంలో నాగాపురం గ్రామానికి వంతెన ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదని గ్రామ స్తులు కొనియాడారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ కొల గాని రామారావు, టీడీపీ సీనియర్ నాయకులు బప్పన ప్రసాద్, గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నేడు కర్ఫ్యూ కారణంగా శ్రీ స్వామివారి దర్శనములకు

# భక్తులకు అనుమతి నిరాకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అన్నవరం నందు జిల్లా కలెక్టర్,కాకినాడ వారి ఉత్తర్వుల మేరకు ప్రతి ఆదివారం కర్ఫ్యూ విదించిన కారణంగా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు భక్తులను ఎవరిని ఆలయమునకు అనుమతించ కుండా శ్రీ స్వామివారికి నిర్వహించవలసిన కార్యక్రమాలన్నీ ఏకాంతంగా శాస్త్ర ప్రకారంగా నిర్వహించబడును.తదుపరి సోమవారం నుండి శనివారము వరకు భక్తులకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు శ్రీ స్వామివారి దేవస్థానము నకు అనుమతించబడును.కావున శ్రీ స్వామివారి దేవస్థానం నందు నిర్వహించు అర్జిత సేవలు (వ్రతములు,స్వామి వారి నిత్య కళ్యాణం, ఆయుష్ హెూమము,చండీ హెూమము) మొదలగు సేవలు యందు భక్తులు ప్రత్యక్షంగా పాల్గొని సదరు సేవలను నిర్వహించుకొనవచ్చును అని దేవస్థానం కార్య నిర్వహణాధికారి వి.త్రినాథరావు కోరారు.

# పాడేరును జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న అధ్యక్షులు పి.మల్లేష్

కొయ్యూరు : పాడేరును జిల్లాగా ప్రకటించి అల్లూరి జిల్లాగా పేరు పెట్టాలని అల్లూరి యువ గిరిజన సేవ సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అల్లూరి నడియాడిన ఈ ప్రాంతాన్ని అల్లూరి జిల్లాగా నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు పి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి పి.సన్యాసిరావు, కార్యదర్శి పి.రామరాజు, ట్రెజరల్ పి.చిట్టియ్య, సంఘ ప్రతినిధులు, పెద్దలు, యువత పాల్గొన్నారు.

## ఆర్బిట్రేజ్ ఫండ్‌తో స్వల్పకాలపు ఒడిదుడుకులపై సవారీ చేయండి

విశాఖపట్నం : మార్కెట్ ఒడిదుడుకుల వేళ పెట్టుబడిదారుల నుంచి ఆర్బిట్రేజ్ విభాగపు నిధుల పట్ల అమితాసక్తిని గమనించడం జరిగింది. పెట్టుబడిదారులు కనీస రిస్క్, ఆవర్తన ఆదాయ, పన్ను ప్రయోజనాలతో మూలధన వృద్ధి లక్ష్యంగా చేసుకుని ఆర్బిట్రేజ్ ఫండ్‌ను ఉపయోగిస్తున్నారు. పూర్తిస్థాయి హెడ్జ్ ఈక్విటీ పోర్ట్‌ఫోలియో మెరుగైన ఆర్బిట్రేజ్ అవకాశాల కోసం చూడటంతో పాటుగా ఏదైనా డైరెక్షనల్ ఈక్విటీ కాల్ యొక్క నష్టాలను సైతం దూరంగా ఉంచుతుంది. తొలి తరం ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో ఒకటి యుటీఐ ఆర్బిట్రేజ్ ఫండ్. దీనిని 2006లో ఆవిష్కరించారు.మిశ్రమ వార్షిక వృద్ధి పద్ధతిలో ఈ ఫండ్ తమ రెగ్యులర్ ప్లాన్ గ్రోత్ ఆప్షన్ కింద 5.36% రాబడిని అందిస్తుంది అలాగే తమ డైరెక్ట్ ప్లాన్ గ్రోత్ అవకాశం కింద 5.90% రాబడిని అందిస్తుంది.

# ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలు



విగ్రహ ప్రతిష్ఠలు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : మండలంలో నడుంపాలెం, గన్నర్లపాలెం, రేవడి వీధి గ్రామాల్లో అభయ ఆంజ నేయస్వామి విగ్రహ ప్రతిష్టలు ఘనంగా నిర్వహించారు. శ్రీసద్గురు సేవాశ్రమం భీమిలి వారి ఆర్థిక సహాయంతో, విశ్వ హిందుపరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ వారి సహకారంతో జరి గాయి.

మల్లిబాబు, సన్యాసిరావు, బి.సోమరాజు, కె.వీర్రాజు, కె.లింగ మూర్తి, నడుంపాలెం, గన్నర్ల పాలెం, రేవడివీధి గ్రామ స్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నడుంపాలెంలో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నడుంపాలెం గ్రామ వాసి అయిన దలే అప్పారావు ఆర్థిక సహాయంతో భారీగా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

# చోడవరంలో ఒకే రోజు నలుగురికి కరోనా పాజిటివ్

చోడవరం: చోడవరం పట్టణంలో ఒకే రోజు నలుగురికి కరోనా పాజిటివ్ రావడంతో స్థానికంగా కలకలం రేగింది. దీంతో పట్టణ వాసులు ఆందోళన నెలకొంది. పట్టణంలోని చందక వీధి ఒకే కుటుంబానికి చెందిన భార్య భర్త, కుమారుడు తో పాటు, ఎడ్ల వీధిలో మరో వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడంతో అధికారులు తక్షణం స్పందించి వారిని విశాఖ ఐసోలేషన్ శనివారం సాయంత్రం తరలించారు. అలాగే వారితో కాంటాక్ట్ లో ఉన్న వారిని గుర్తించే చర్యలు అధికారులు చేపడుతున్నారు. కరోనాపై నిర్లక్ష్యం వహించకుండామాస్కులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తహసీల్దార్ రవి కుమార్ కోరారు.

# 10లీటర్ల నాటు సారాయి స్వాధీనం

**- ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ - కేసు నమోదు**

పెద్దాపురం : పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో పెద్దాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టీమ్‌లు దాడులు నిర్వ హించగా, పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామ పరిధిలో సింగన మల్లిఖార్జునరావు పీతా నాగమణి అను ఇద్దరు వ్యక్తు లను 10 లీటర్ల నాటు సారాయి తో పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించడమైనది. ఈ దాడుల్లో పెద్దా పురం ఎస్ఇబి సిఐ రామ కృష్ణ దాస్ ఎస్ఐలు జె.విజయ కుమార్. కె.తాతారెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎస్ఇబి సిఐ రామకృష్ణ దాస్ తెలిపారు.



# ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారికి శనివారం ప్రాకారసేవ ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి, అమ్మ వార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశినులు గావించి భక్తుల గోవింద నామ స్మరణాలు,మేళ,తాళాలు సడుమ శ్రీ స్వామి, అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.ఈ కార్యక్రమంలో ఈవో త్రినాధరావు, డిప్యూటీ ఈవో ఈరంకి జగన్నాధరావు, ఏసి రమేష్ బాబు ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# బి.కింతాడలో కరోనా కల్లోలం

- **21ఏళ్ళు మహిళ పాజిటివ్ తో మరణం**
- **అంత్యక్రియలు తరువాత నిర్ధారణ**
- **పరుగులు తీసిన అధికారులు**





దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో మరో పాజిటివ్ కేసు నమోదైంది. 21 ఏళ్ళ వివాహిత అనారోగ్యం కారణంగా ఈ నెల 16న ఉదయం విశాఖ కె జి హెచ్ లో మృతి చెందడంతో ఆమెను బి. కింతాడ గ్రామానికి కుటంబసభ్యులు తరలించి అదే రోజు మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు జరిపారు. శుక్రవారం ఉదయం ఆమెకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీనితో వేచలం పి హెచ్ సి వైద్య సిబ్బంది అరా తీయగా ఆమె గురువారం కె జి హెచ్ లో మరణించిందని తన భర్త ఊరు కింతాడకు తీసుకువచ్చి దహనం చేశామని కుటుంబ సభ్యులు తెలపడంతో అధికారుల్లో కలవరపాటు మొదలైంది. దీనితో అధికారులు గ్రామం వైపు పరుగులు తీసి ఆమెతో ఉన్న కుటుంబీకులను, అంత్యక్రియలలో పాల్గొన్నావారి వివరాలను సేకరించారు. కొంత మందిని తెనుగుపూడి కోరెంటెన్ కు తరలించారు. గ్రామంలో శానిటేషన్ చేయించి, రెడ్ జోన్ గా ప్రకటించారు.

# చోడవరం ఎమ్మెల్యే కు ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ కార్మికుల ఘన సత్కారం

**- కాంట్రాక్ట్ కార్మికులను వోచర్ పేమెంట్ కార్మికులుగా గుర్తించేందుకు కృషి చేస్తా - ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ కార్మికులు శనివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని అంబే రు పురం గ్రామంలో తులసి కళ్యాణ మండపం లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను యూనియన్ నాయకులు ప్రకాష్, నక్క శ్రీను, బండారు శ్రీనివాసరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికులుగా 360 మంది వరకు పని చేస్తున్నారని, అయితే ఏళ్ల తరబడి కాంట్రాక్టర్ల వద్ద పని చేయడం వల్ల తమకు ఎలాంటి గుర్తింపు ఉండడంలేదని, అలాగే తమకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ కాంట్రాక్ట్ కార్మికులను వోచర్ పేమెంట్ కార్మికులుగా గుర్తించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మశ్రీని కాంట్రాక్టు కార్మిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, సరగడం సిమ్మి నాయుడు, పల్లా నర్సింగ్ రావు, శ్రీకాంత్ సూరిశెట్టి నాగ దుర్గ గోవిందా, అల్లం రామ అప్పారావు, సరగడం నాగేశ్వరరావు, షుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ నాయకులు సరగడం రామునాయుడు, రాయి సూరిబాబు, పిఎస్ నాయుడు, యూనియన్ నాయకులు కె.వి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు అఫ్ బరోడా 113 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని

# స్వచ్ఛంద సేవ కార్యక్రమ వారోత్సవాలు




విశాఖపట్నం : ప్రభుత్వ రంగ బ్యాంకులలో దేశములోనే అతి పెద్ద మూడవ బ్యాంకు అయినటువంటి బ్యాంకు అఫ్ బరోడా 113 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జులై 20, 2020 వ తారీఖున జరుపుకునే సందర్భములో స్వచ్ఛంద సేవ కార్య క్రమ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు .ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు తన వంతు సహకారంగా ప్రస్తుతము దేశాన్ని పీడిస్తున్న కరోనా మహమ్మారి నివారణ చర్యలలో భాగంగా కరోనా పరీక్షలకు అవసరమైనటువంటి కియోస్క్ ను నగరంలో చెస్ట్ హాస్పిటల్ మరియు ప్రాంతీయ కంటి ఆసుపత్రికి వితరణగా ఇవ్వడము జరిగింది.ప్రస్తుత పరిస్థితులలో దేశానికి సేవలందిస్తూ వెన్నె ముకగా నిలచిన వైద్య విభాగం తరపున డాక్టర్ పి. సుధాకర్ (ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్) ని మరియు పారామెడికల్ సిబ్బంది అయినటువంటి రాధాని సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం విద్యార్థులకు అవసరమైనటువంటి ఆన్లైన్ విద్యా బోధనను దృష్టిలో ఉంచుకుని డిజిటల్ టీవీ , ప్రింటర్ తదితర సామాగ్రిని జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల పాతవలసకు సమకూర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు అఫ్ బరోడా విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయపు అధికారి అయినటువంటి శైలేంద్ర కుమార్ సింగ్, ఉప ప్రాంతీయ అధికారి అయినటువంటి శ్రీ శేషు కుమార్ తాడి, చిట్టా శ్రీనివాస రావు మరియు ఇతర బ్యాంకు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఆదర్శనీయం డాక్టర్ టైటస్ సేవలు

- **కరోనా విపత్తులో పేదలకు చేయూత**
- **సమాజ శ్రేయస్సు కోసం అడుగులు**
- **అంతర్జాతీయ స్థాయిలో సేవలకు గుర్తింపు**










దేవరాపల్లి : ప్రభు సేవలో తరిస్తూ సమాజ శ్రేయస్సు కోసం ఆయన వేస్తున్న అడుగులు అభినందనీయం. కరోనా విపత్తులో కూడా తన సేవలను ఆపకుండా ఏజన్సీ మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజనులకు, మైదానంలో నిరుపేద కుటుంబాలకు, దైవ జనులకు తన వంతు చేయూత నందించారు డాక్టర్ గొర్లె టైటస్ . ఆయన విస్తృత సేవలపై 'విజయభాను' ప్రత్యేక కథనం

నిస్సి గాస్పల్ వెల్ఫేర్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ ను 2010లోవిశాఖపట్నం జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామంలో స్థాపించారు .ఈ సంస్థ ద్వారా అనేకమైన పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కుల మత భాష ప్రాంతీయ భేదం లేకుండా ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా గిరిజన ప్రజలకు, ఆదివాసులకు సేవ చేయాలని దృఢమైన నిశ్చయంతో ఉన్నారు. గత నాలుగు నెలలుగా ప్రపంచాన్ని పీడిస్తున్న భయంకరమైన కరోనా కోవిడ్-19 విపత్తు పరిస్థితుల్లో కూడా ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ప్రాణాలకు తెగించి సమాజ శ్రేయస్సు కోసం సేవ చేస్తున్న పోలీస్ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు, వైద్య సిబ్బందికి వైద్య కిట్లు, మాస్కు, శానిటేజర్ లు అందజేశారు. అంతేకాకుండా గిరిజన ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా ఈ స్వచ్ఛంద సంస్థ 3500 కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులు కూరగాయలు పంపిణీ చేయడం చేశారు . మైదాన ప్రాంతాల్లో నిరుపేదలైన 160 కుటుంబాలకు ఒక కుటుంబానికి వెయ్యి రూపాయల చొప్పున నగదు పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటారు. కోవిడ్-19 పరిస్థితులు, వాటి జాగ్రత్తలపై కరపత్రం ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గిరిజన ప్రాంతాలకు నడుచుకుంటూ వెళ్లి వారి అవసరాలను గుర్తించి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ విధంగా ఈ సంస్థ ద్వారా భారతదేశంలో సుమారు 8 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయని డాక్టర్ టైటస్ తెలిపారు . కేంద్ర పాలిత రాష్ట్రాల్లో కూడా ఈ సంస్థ ప్రతినిధుల ద్వారా ఒరిస్సా, యానం, తమిళనాడు, చతిస్గడ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో సేవలు అందించామన్నారు. కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో ఈ సంస్థ చేసిన సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని జాతీయంగా, అంతర్జాతీయంగా కొన్ని ఆర్గనైజేషన్స్ నుంచి అభినందనలు, ప్రశంస పత్రాలను పొందారు. సుమారు 170 ఆర్గనైజేషన్స్ ద్వారా ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పలువురు ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు నుంచి కూడా అభినందనలు స్వీకరించారు . వీటిలో ముఖ్యంగా ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్స్. ఇనిస్ట్యూట్ ఢిల్లీ, చోలాన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు తమిళనాడు, ఓ యమ్ జి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ముంబాయి, బ్రెజిల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ కూడా బహుకరించారు. 170 అవార్డులు ఈ సంస్థకు లభించాయి. ఈ సంస్థ కు ప్రోత్సహించిన వారందరికీ ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొర్ల టైటస్, గ్రేస్ టైటస్ దంపతులను మండల ప్రజలు, కమిటీ సభ్యులు అభినందిస్తున్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ,బీజేపీ కార్యకర్తలు

# వైసీపీలో చేరిక



పార్టీలో చేరిన దృశ్యం

కొయ్యూరు : పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆంధ్ర రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగరావు ఆధ్వర్యంలో కొయ్యూరు మండల నాయకులు జల్లిబాబు అధ్యక్షతన వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కొయ్యూరు మండలం బిజెపి నుంచి జుర్ర చిట్టిబాబు, పాట్టిక లక్ష్మణరావు, టీడీపీ నుంచి వీరే పెంట్టిబాబు, పొట్టిక అర్జునరావు, పొట్టిక తలుపులయ్యతో పాటు 100 మంది కార్యకర్తలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇన్ని సంవత్సరకాలంలో గిరిజన పక్షపాతి వ్యవరిస్తున్న ముఖ్యమంత్రి ఉన్నారంటే అది కేవలం ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

మన్య ప్రాంత అంత పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కానీ ఫారెస్ట్, రెవిన్యూ వారితో ఇబ్బందిగా ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, మన జగనన్న ఆగస్టు 9న ఆర్ఒఎఫ్ పట్టాలు ఇవ్వనున్నట్లు తెలినపారు. ఈ కార్యక్రమంలో పొట్టిక శ్రీను, పి.రాంబాబు, రేగం రమణ, పాడి గంగరాజు, పొట్టిక సింహాచలం పాల్గొన్నారు.

## కళాకారులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాఖపట్నం : కరోనా వల్ల గ్రామ దేవతల పండగలు నిలిపివేయడంతో ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కళాకారుల గురించి తెలుసుకున్న రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ శరకటం శ్రీరామచంద్రమూర్తి సొంత నిధులతో 200 మందికి నిత్యావసర వస్తువుల్ని అందజేశారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు కొణతాల కాంప్లెక్స్‌లో వీటిని ట్రస్ట్ కన్వీనర్ కొణతాల రేవతిరావు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలన్నీ నిబంధనలు పాటించాలి

● పరిశ్రమలు పై ఏర్పాటు చేసిన కమిటీలు ఈ నెల 20 నుండి 29 వరకు వివిధ ఫ్యాక్టరీలు పరిశీలిస్తారు

● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడి



విశాఖపట్నం : కొత్తగా వచ్చిన పరిశ్రమలూ ప్రభుత్వం ఇచ్చిన నార్మ్స్ పాటించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో జరుగుతున్న సంఘటనలు, నివారణ చర్యలపై పరిశ్రమల యాజమాన్యం, అధికారులతో వియంఆర్డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాటు చేసిన సమావేశానంతరం శనివారం విలేఖరులతో ఆయన మాట్లాడారు. గత రెండు నెలల నుండి పరిశ్రమల్లో జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల యాజమాన్యం, అధికారులతో ఏర్పాటు చేసి తగు సూచనలు జారీ చేసినట్లు ఆయన వివరించారు. అగ్నిమాపక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బాయిలర్స్, ఫ్యాక్టరీస్ శాఖలు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. ఆయా శాఖలు పరిశ్రమలను ర్యాండంగా చెకింగ్ చేయాలన్నారు.

ఫైర్ సేఫ్టీని అన్ని పరిశ్రమలు పాటించాలని చెప్పారు. పరిశ్రమలు నిర్మాణం జరుగుతున్నపుడే ఫైర్ సేఫ్టీ ని పాటించాలని తెలిపారు. ఎల్.జి. పాలిమర్స్ సంఘటనలో అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలు పాటించి పనిచేయాలని, ఏ మాత్రము వెసులుబాటు ఇచ్చినా ప్రజల ప్రాణాలు పోతాయన్నారు. పరిశ్రమలు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిష్పక్షపాతంగా ఉండాలని అధికారులకు చెప్పినట్లు పేర్కొన్నారు. పరిశ్రమలను రెడ్, ఆరంజ్, గ్రీన్ జోన్ లుగా విభజించడమైనదని, పరిశ్రమల పరిశీలనపై జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ కమిటీలను ఏర్పాటు చేయడమైనదని, ఈ కమిటీలు ఈ నెల 20 నుండి 29 వరకు ఆయా పరిశ్రమలను సందర్శించి, కమిటీలు తగు సూచనలు జారీ చేస్తాయని, ఆయా పరిశ్రమలు సూచనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

నాలుగు శాఖలు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. ప్రభుత్వం తరపున లోపం లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పరవాడ ఫార్మా సిటీలో ఒక ఆసుపత్రి నిర్మాణంనకు ఆయా ఫార్మా కంపెనీలు నిధులను సమకూర్చుకున్నాయని, భూ సమస్య వలన నిర్మాణం జరగలేదని, భూ సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

ఫార్మా సిటీలో మౌళిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంటు సభ్యులు జి. మాధవి, గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్యకేసులో సీబీఐ విచారణ ప్రారంభం

కడప: మాజీ మంత్రి వికానందరెడ్డి హత్యకేసులో సీబీఐ విచారణ ప్రారంభించింది. ఏపీ హైకోర్టు ఆదేశాలతో సీబీఐ అధికారులు విచారణ మొదలుపెట్టారు. కడప ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అన్బురాజన్‌తో ఏడుగురు అధికారులు సమావేశమయ్యారు. 2019 మార్చి 15న జరిగిన వివేకా హత్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పులివెందులకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నారు.

వివేకా హత్య కేసును సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ ఆయన కుమార్తె సునీత హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టి ధర్మాసనం నాలుగు నెలల ముందే ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. హత్య జరిగి ఏడాది గడుస్తున్నా 'మిస్టరీ' ఇంకా వీడలేదని అప్పట్లో వ్యాఖ్యానించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)/రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఇప్పటికే ఈ కేసుపై మూడు సార్లు విచారణ చేపట్టారు. దాదాపు 1300 మంది అనుమానితులను విచారించారు. అయినప్పటికీ హంతకులను గుర్తించలేదని హైకోర్టు ఆక్షేపించింది. కేసుపై విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది.

హత్యకు రాజకీయ కారణాలా, భూమి, ఆస్తి తగాదాలా అనే విషయాలను సిట్ తేల్చలేకపోయిందని చెబుతూ..హత్య ఘటన ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదని, ఇతర రాష్ట్రాల వ్యక్తుల జోక్యం ఉండొచ్చనే సందేహం హైకోర్టు వెలిబుచ్చింది. ఇలాంటి కేసుల దర్యాప్తులో సమయం చాలా కీలకమైందని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకొని ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు ముగించి, 'తుది నివేదిక'ను దాఖలు చేయాలని సీబీఐకి సూచించింది. ఈ కేసుకు చెందిన అన్ని రికార్డులను సీబీఐకి అప్పగించాలని సిట్‌ను ఆదేశించింది.

## పూజ్యస్వామివారి పరమగురువుల ఆరాధన



విశాఖపట్నం : షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య సంప్రదాయ విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఋషికేశ్ లో గల విశాఖ శ్రీ శారదాపీఠం శాఖా భవనంలో శనివారం తమ పరమగురువులైన శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి ఆరాధనా మసూత్సవం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అద్వైత తత్వమునకు జగద్గురు ఆదిశంకరుల తర్వాత మరలా నేటి కాలంలో అంతటి కృషి చేసినట్టువంటి మహనీయుడు శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు. కర్ణాటక రాష్ట్రం హెరీళేనర్సీపూర్ కేంద్రంగా 200 పైచిలుకు కన్నడ, సంస్కృత, ఇంగ్లీషు భాషలలో వివిధ రకాల అద్వైత ప్రకరణ గ్రంథములను ప్రకటన చేసి అందరకు మార్గదర్శకులయ్యారు. వారి యొక్క ఉపదేశములనే విశాఖ శ్రీ శారదా పీఠం అనుసరిస్తూ అద్వైత ప్రచారం గావిస్తున్నారు. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారికి వారి పరమగురువులైన శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి పట్ల చాల భక్తి భావాని కలిగి ఉంటారు. పరమగురువులే అపర శంకరులని, అద్వైత భాస్కరులని స్వామివారు వారి ప్రవచనములందు పలుసార్లు ప్రస్తావించి యున్నారు. అటువంటి మహాస్వామివారి ఆరాధన మహోత్సవం ఈ నాడు ఋషికేష్ లో శ్రీచరణుల సమక్షంలో నిర్వహించియున్నారు. ఈ కార్యక్రమంలో పీఠం ఉత్తరపీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివారు వేదవిద్యార్థులతో కలసి తైత్రియోపనిషత్తును పారాణయ చేశారు. చాతుర్మాస్య దీక్ష కోసం ఋషికేష్ లో ఉండే సమయంలో ఆరాధన మహోత్సవాలను విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా పలువురు బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను బహుకరించారు.

## గవర్నర్ బిశ్వభూషణ్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి: ఏపీలో వేధింపులు, చట్టవిరుద్ధమైన అరెస్టులు జరుగుతున్నాయని తెదేపా అధినేత చంద్రబాబు ఆరోపించారు. ఈ మేరకు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు లేఖ రాశారు. ప్రాథమిక హక్కుల పునరుద్ధరణ, పరిరక్షణ కోసం లేఖలో ప్రస్తావించారు. చట్టవిరుద్ధమైన అరెస్టులు, అక్రమ నిర్బంధాలు పెరిగిపోయాయని లేఖలో పేర్కొన్నారు. "భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. మాట్లాడే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛను అధికార పార్టీ హరించేస్తోంది. సోషల్ మీడియా వేదికగా పోలీసులు అనాగరిక ధోరణితో వ్యవహరిస్తున్నారు" అని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. రూ.5.20కోట్ల నగదు అక్రమ రవాణా కేసులో ఎమ్మెల్యే బాలినేనిపై తమిళనాడు అంతటా మీడియాలో ప్రసారమయ్యాయని, ఏపీలో మాత్రం నగదు రవాణా చేస్తున్న వారిని వదిలిపెట్టి సందీప్ చంద్రశేఖర్ అనే వ్యక్తిని అరెస్టు అని చంద్రబాబు ఆరోపించారు.

## జివియంసి కమిషనర్ ఇ-స్పందన నిర్వహణ



విశాఖపట్నం: పట్టణ పరిధిలో కరోనా మనసు చెందుత పుతుండడం వలన, ప్రజల వద్దనుండి విన్నపములు నేరుగా స్వీకరించేందుకు అవకాశము ఉండుటలేదు. దీన్ని దుషిలో పెట్టుకొని, జి.వి.యం.సి. కమిషనర్ టి.జి సృజన అంతర్జాలం సహాయంతో పేస్ బుక్, ట్విట్టర్, వంటి సామాజిక మాధ్యమాల వరా ప్రజల వద్ద నుండి విన్నపములు స్వీకరించారు. పిర్యాదుదారులతో నేరుగా మాలూడు పిర్యాదులపై వివరణ ఇస్తూ, సమస్యల పరిష్కారానికి కల పట్టణ పరిదిలో పలుప్రాంతాల నుండి వీధి దీపాలు సమస్యలపై స్పందిస్తూ, వాటిని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సదరు సంబందిత ఇంజనీరింగు అధికారులకు పంపమని ఆదేశించారు. రోడ్లు మరియు కాలువలు వంటి మౌళిక వసతులు ఏర్పాటుకు గాను వచ్చిన విన్నపములపై స్పందిస్తూ నగరంలో పలు మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, కార్పోరేషన్ ఆర్థిక వనరులు ద్రుష్టిలో పెట్టుకొని, రోడ్లు, కాలువలు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా సుదూర ప్రాంతాలలో విలీనప్రాంతాలందు వీటి ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వచ్చిన విన్నపములు పరిశీలించి తగు చర్యలు చేపట్టే నిమిత్తం సంబందిత ఇంజనీరింగ్ అధికారులకు పంపుతామన్నారు. ఆస్తి పన్ను అంశంపై స్పందిస్తూ, సంబందిత పెండింగులో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిస్కరించాలని సంబందిత అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఇకముందు సచివాలయాల ద్వారా వీటికి సంబందించిన విన్నపములు పెట్టుకోవాలని అర్జీదారులకు సూచించారు.

కోవిడ్ - 19 సంబందిత అంశాలుపై స్పందిస్తూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన నిభందనలకు అనుగుణంగా, గృహనిర్భందం, ఐసోలేషన్, కోవిడ్ పరీక్షలు, కరోనా సోకిన వారు గృహనిర్బందంలో వుండి చికిత్స చేసుకోవడం, విదేశాలు, ఇతర ప్రాంతాలనుండి వచ్చేవారికి గల ప్రోటోకాల్ నిభందనలు మొదలగు వాటిపై ప్రతీ వ్యక్తికి వివరంగా సమాధానం తేల్పారు. పట్టణ పరిధిలో ఇండ్లు గూర్చి ఇదివరకే అర్హత పొందిన వారి పేర్లు, ప్రస్తుతం అర్హత జాబితాలో లేవని, వాటికి గల కారణాలు తెల్పమని మరికొందరు ప్రశ్నించగా, సంబందిత అధికారులతో వాటిపై మరొక్కసారి పరిశీలన చేయించి, అర్హులని తేలితే తప్పకుండా వారికీ సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమస్యలపై 495బిమంది స్పందించి, వివరణలు అడిగి, విన్నపములు సమర్పించారు. వీటిపై తగు చర్యలు తీసుకొనే నిమిత్తం సంబందిత ప్రధాన విభాగపు అధికారులు/జోనల్ స్థాయి అధికారులకు పంపడానికి చర్యలు తీసుకున్నారు.

## చీడివలస ఎత్తిపోతల పథకానికి పచ్చజెండా



(ఫైల్ ఫోటో)

పోలాకి : వంశధార ప్రధాన కాలువపై నరసన్నపేట బ్రాంచికెనాల్ మీద, చీడివలస వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని కలసిన మంత్రి ధర్మాన కృష్ణదాస్ కు సీఎం నుంచి స్పష్టమైన హామీ లభించింది. వెంటనే పథకానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట నివేదిక (డీపీఆర్)ను రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రూ. 6.5 కోట్ల అంచనా వ్యయం కాగలదని భావిస్తున్న ఈ పథకం గనక పూర్తయితే పోలాకి మండలంలోని జిల్లేడు మాకివలస, చెల్లాయివలస బొరిగివలస, తోటాడ, ఓదిపాడు రెవెన్యూ పరిధిలోని 673 ఎకరాల మెట్ట భూములకు సాగునీరు లభిస్తుంది. గతంలో ఓదిపాడు వద్ద ఉన్న పథకం దశాబ్దకాలంగా శిదిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యర్ధన మేరకు మంత్రి ధర్మాన కృష్ణదాస్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో ఇప్పటికే అధికారుల బృందం రెండు సార్లు పర్యటించింది. యువనేత డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య కూడా రైతుల విజ్ఞప్తి మేరకు ఎత్తిపోతల పథకానికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించారు.

పథకం ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం పట్ల స్థానికంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. నీటి వినియోగ అనుమతులు (హైడ్రోలాజికల్ క్లియరన్స్) వచ్చిన వెంటనే 45 రోజుల్లో ప్రక్రియను మొదలుపెట్టే అవకాశముందని రాజధాని నుంచి సమాచారం రావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దాడ భైరాగినాయుడు, తూలుగు కామయ్య, చింతు అప్పలనాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేసారు.

మంత్రి ధర్మాన కృష్ణదాస్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

### ఏనేటి కొండ కులస్థులను ఆదుకోవాలి
### ముఖ్యమంత్రికి ధర్మాన కృష్ణదాస్ విజ్ఞప్తి

ఏనేటి కొండ కులానికి చెందిన ఎస్టీలకు ద్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో చొరవ తీసుకోవాలని మంత్రి ధర్మాన కృష్ణదాస్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రి, జిల్లాలోని టెక్కలి డివిజన్, నరసన్నపేట నియోజకవర్గంలోని ఏనేటి కొండ కులస్తుల సమస్యలను గురించి ప్రస్తావించారు. ఎస్టీలుగా గుర్తింపు ఉన్నప్పటికీ దశాబ్దకాలానికి పైగా ద్రువీకరణ పత్రాలు అందక వారంతా పడుతున్న ఇబ్బందులను గురించి ముఖ్యమంత్రి వివరించారు. పత్రాల జారీకి ఉన్న నిషేదాన్ని ఎత్తివేసేందుకు త్వరలోనే దీనిపై కమిటీ వేస్తామని, తప్పకుండా వారికి న్యాయం జరిగేలా చేద్దామని సీఎం, మంత్రికి హామీనిచ్చారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీలకు మేలు చేకూర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి సారధ్యంలోనే సాధ్యమైందని, గత ఏడాది కాలంలోనే అట్టడుగు వర్గాల వారికి ఎనలేని మేలు చేకూరిందని అన్నారు.

## చంద్రబాబుకు ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదు

### మంత్రి ఆదిమూలపు సురేష్



అమరావతి: అరెస్టులపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అరెస్టులు, నేరాలను కప్పిపుచ్చుకునేందుకే టీడీపీ నేతలు రాష్ట్రపతిని కలిశారని ఆయన ధ్వజమెత్తారు." గత ఐదేళ్ల పాలనలో టీడీపీ రాజ్యాంగానికి తూట్లు పొడిచింది. టీడీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ఇంగ్లీష్ మీడియాన్ని అడ్డుకుని పేదలకు టీడీపీ అన్యాయం చేసింది. ఇంగ్లీష్ మీడియంపై రాష్ట్రపతి మిమ్మల్ని ప్రశ్నిస్తే టీడీపీ ఏం సమాధానం చెబుతుంది?. చంద్రబాబు పీఎస్ ఇంట్లో సోదాల తర్వాత 2వేల కోట్ల లావాదేవీలకు ఆధారాలు బయటపడ్డాయి.చంద్రబాబుకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదని" ఆయన దుయ్యబట్టారు. సంక్షోభంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి సురేష్ తెలిపారు. ఇంగ్లీష్ మీడియాన్ని అడ్డుకుని పేదల పిల్లలకు టీడీపీ అన్యాయం చేసిందన్నారు. పేద ప్రజల బిడ్డలు ఎదగడం టీడీపీ నేతలకు ఇష్టం లేదని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా దళితుడిని నియమిస్తే అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. పరిపాలన వికేంద్రీకరణ, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి పాటు పడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

"సీబీఐ, సీఐడీలపై కూడా టీడీపీ నేతలకు నమ్మకం లేదు. టీడీపీ నేతలు కేసుల నుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. వైఎస్సార్ చేయూత కింద మహిళలకు కొత్త పథకాలు ప్రవేశ పెడుతున్నాం. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించామని" మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు.

## ఏపీలో సంక్షేమ పాలన జరుగుతుంది

### గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ



విజయవాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనా వ్యాప్తి పట్ల భయపడొద్దని, ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. కరోనా బాధితులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 0866- 2428666కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడతామని సీఎం వైఎస్ జగన్ మాట ఇచ్చారని, ఆయన మాట ఇచ్చారంటే కచ్చితంగా నిలబెట్టుకుంటారని వల్లభనేని వంశీ అన్నారు.

## వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కమిటీలు రద్దు

### కొత్త కమిటీలను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ



అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కమిటీలను రద్దు చేస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గతంలో ఉన్న అన్ని లీగల్ సెల్ కమిటీలను రద్దు చేసింది. వారి స్థానంలో కొత్త కమిటీలను నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం పత్రికా ప్రకటనను విడుదల చేసింది. తాజా నియమాకాల ప్రకారం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్. మనోహర్‌రెడ్డి నియమితులైయ్యారు. ఆయనతో పాటు మరో నలుగురు సభ్యులకు రాష్ట్ర కమిటీలో చోటుకల్పించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com